www.vishalabharati.com
epaper:vishalabharati.com

గురువారం, హైదరాబాద్
10 ఆగస్టు జూలై 2023
సంపుటి:1 సంచిక:291

# విశాల భారతి

తెలుగు దినపత్రిక

## విపక్షాల వల్లే మణిపూర్ ఘటన

- ప్రభుత్వాలను కాపాడుకోవడానికి అవినీతి
- ఆ పార్టీల నిజస్వరూపం అందరికీ అర్ధమైంది
- విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా



**నేషనల్ బ్యూరో-విశాల భారతి:** ప్రభుత్వాలను కాపాడుకోవడానికి విపక్ష కూటమి పార్టీలు అవినీతికి పాల్పడ్డాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరోపించారు. దీన్ని బట్టే ఆ పార్టీల నిజ స్వరూపం అందరికీ అర్థమైందని అన్నారు. విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై మాట్లాడిన ఆయన.. 1999లో అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు అవినీతికి పాల్పడలేదని, బదులుగా రాజీనామా చేసేందుకే మొగ్గు చూపారని తెలిపారు. కాంగ్రెస్ మాత్రం.. ఎంపీలకు లంచాలు

..మిగతా |2| లో





## అప్పుడు హగ్ ఇచ్చి, కన్ను కొట్టి..
## ఇప్పుడు ఫ్లయింగ్ కిస్...

### రాహుల్ గాంధీపై మహిళా ఎంపీల ఫిర్యాదు
### పక్కదారి పట్టించే వ్యూహం అంటూ చిదంబరం వ్యాఖ్య
### 'రాహుల్‌ను టీవీలో చూపించరా?' అంటూ విమర్శలు

**నేషనల్ బ్యూరో-విశాల భారతి:** కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ లోక్‌సభలో ఫ్లయింగ్ కిస్ ఇచ్చారన్న ఆరోపణలు దుమారం రేపాయి. సభలో ఇలాంటి చర్య ఎప్పుడూ చూడలేదని కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ వ్యాఖ్యానించారు. మహిళా వ్యతిరేకులు మాత్రమే ఇలాంటి పని చేయగలరని ధ్వజమెత్తారు. ఈ ఘటనను తీవ్రంగా వ్యతిరేకిస్తూ బీజేపీ మహిళా ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిశారు. రాహుల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్పీకర్‌కు చేసిన ఫిర్యాదులో 20 మంది మహిళా ఎంపీలు సంతకాలు చేశారు. 'కాంగ్రెస్ సభ్యుడు సభలో మాట్లాడుతూ స్మృతి ఇరానీవైపు అనుచిత సంజ్ఞలు చేశారు' అని ఫిర్యాదులో మహిళా ఎంపీలు ఆరోపించారు. అవిశ్వాస తీర్మానంపై రాహుల్ మాట్లాడిన తర్వాత.. కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ ప్రసంగించారు. రాహుల్ లక్ష్యంగా విమర్శలు గుప్పించారు. "నా కన్నా ముందు మాట్లాడిన వ్యక్తి అసభ్య సంజ్ఞ చేశారు. మహిళా వ్యతిరేకులు మాత్రమే మహిళా ఎంపీలు ఉండే పార్లమెంట్‌కు ఫ్లయింగ్ కిస్ ఇవ్వగలరు. ఆ (గాంధీ) కుటుంబ సంస్కృతిని దేశమంతా చూసింది" అని ఇరానీ మండిపడ్డారు. మరోవైపు, బీజేపీ ఎంపీ, కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే సైతం రాహుల్‌పై విమర్శలు చేశారు. "స్మృతి ఇరానీ వైపు, అందరు మహిళా సభ్యులు ఉన్నవైపు చూసి ఫ్లయింగ్ కిస్ ఇచ్చి వెళ్లిపోయారు. ఇది అనుచితమే కాదు.. అసభ్యకరం కూడా. పార్లమెంట్ చరిత్రలో ఇలాంటిది ఎన్నడూ జరగలేదని సీనియర్ ఎంపీలు చెబుతున్నారు. కాబట్టి దీనిపై మేం స్పీకర్‌కు ఫిర్యాదు చేశాం. సీసీటీవీ కెమెరా ఫుటేజీని పరిశీలించి ఎంపీపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరాం" అని కరంద్లాజే వివరించారు. పార్లమెంట్.. ఫ్లయింగ్ కిస్‌లు ఇచ్చే ప్రదేశమా? అంటూ బీజేపీ ఎంపీ రవిశంకర్

..మిగతా |2| లో

**పక్కదారి పట్టించే వ్యూహం**

బీజేపీ ఎంపీల ఆరోపణలపై కాంగ్రెస్ పార్లమెంట్ సభ్యుడు కార్తి చిదంబరం మండిపడ్డారు. సభలో రాహుల్ గాంధీ కొన్ని కీలక ప్రశ్నలు లేవనెత్తారని, మణిపుర్‌లో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని ప్రశ్నించారని అన్నారు. ఆ ప్రశ్నలకు సమాధానాలు చెప్పకుండా బీజేపీ.. విషయాన్ని పక్కదారి పట్టిస్తోందని ఆరోపించారు. చరిత్రలో జరిగిన వాటి గురించి మాట్లాడుతూ.. మణిపుర్‌తో సంబంధం లేని విషయాలను ప్రస్తావిస్తోందని మండిపడ్డారు.



"ఎంపీ సభ్యత్వం పునరుద్ధరించిన తరవాత రాహుల్ గాంధీ తొలిసారి పార్లమెంట్‌లో ప్రసంగించారు. తన సభ్యత్వాన్ని రీస్టోర్ చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అదానీ వ్యవహారంపై మాట్లాడనంటూ బీజేపీపై సెటైర్లు వేశారు. ఇదే క్రమంలోనే అవిశ్వాస తీర్మానంపై మాట్లాడిన రాహుల్ గాంధీ...ముందుగా భారత్ జోడో యాత్ర గురించి మాట్లాడారు. తన యాత్ర ఇంకా ముగిసిపోలేదని, రెండోసారి యాత్ర నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని తేల్చి చెప్పారు

## మణిపూర్ సాక్షిగా భరతమాతను
# హత్య చేశారు
### ప్రధాని నోరు విప్పరెందుకు?

### నా జోడో యాత్ర ముగిసిపోలేదు
### రెండో యాత్ర చేసేందుకు రెడీ
### పార్లమెంటులో రాహుల్ గాంధీ

**విశాలభారతి స్టేట్ బ్యూరో:** ."లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరించినందుకు స్పీకర్ గారికి ధన్యవాదాలు. నేను చివరిసారి మాట్లాడినప్పుడు మిమ్మల్ని బాగా ఇబ్బంది పెట్టి ఉంటాను. ఎందుకంటే నేను అప్పుడు అదానీ వ్యవహారంపై మాట్లాడాను. బహుశా మీ సీనియర్ లీడర్ (ప్రధాని మోదీని ఉద్దేశిస్తూ) బాధ పడ్డారేమో. బహుశా ఆ బాధ మీపైన (స్పీకర్‌ని ఉద్దేశిస్తూ) కూడా ప్రభావం చూపించి ఉండొచ్చు. అందుకు నేను మనస్ఫూర్తిగా క్షమాపణలు చెబుతున్నాను. కానీ నేను మాట్లాడింది నిజం. కానీ ఈ సారి బీజేపీ మిత్రులు ఏం భయపడాల్సిన పనిలేదు. నేను ఇప్పుడు అదానీ గురించి మాట్లాడడం లేదు" అంటూ రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

**అడ్డుకున్న బీజేపీ ఎంపీలు**

రాహుల్ ప్రసంగిస్తుండగా బీజేపీ ఎంపీలు గట్టిగా నినాదాలు చేశారు. ఆ సమయంలో రాహుల్ రూమీ కొటేషన్‌ని ప్రస్తావించారు. "మనసులో నుంచి వచ్చే మాటలు ఎప్పుడూ...మనసుని తాకుతాయి" అంటూ తన ప్రసంగాన్ని కొనసాగించారు. అవిశ్వాస తీర్మానాన్ని ప్రస్తావిస్తూ మణిపూర్ అంశంపై మాట్లాడారు రాహుల్ గాంధీ. మణిపూర్ రాష్ట్రాన్ని దేశంలో భాగంగా మోదీ సర్కార్ చూడడం లేదని విమర్శలు చేశారు. తాను మణిపూర్‌కి వెళ్లి అక్కడి బాధితులను పరామర్శించానని, ప్రధాని మోదీ మాత్రం ఇప్పటి వరకూ ఆ పని చేయలేదని విమర్శించారు. "ప్రధాని మోదీకి మణిపూర్ మన దేశంలోని భాగం కాదు. ఆ రాష్ట్రాన్ని మోదీ సర్కార్ ముక్కలు చేసింది" అంటూ విరుచుకు పడ్డారు. మణిపూర్‌లో భారత్‌ని హత్య చేశారంటూ తీవ్రంగా విమర్శించారు. మణిపూర్‌లో పర్యటించినప్పుడు చాలా మంది బాధితులను ఓదార్చినట్టు వెల్లడించారు రాహుల్ గాంధీ. కళ్ల ముందే భర్తను కాల్చి చంపినట్టు ఓ బాధితురాలు తనతో చెప్పి కన్నీళ్లు పెట్టుకున్నట్టు వివరించారు. ప్రధాని మోదీని రావణాసురుడితో పోల్చారు రాహుల్. ఆయన అదానీ, అమిత్‌షా మాటలు తప్ప ఇంకెవరి మాటల్నీ వినిపించుకోరని అన్నారు. "ప్రధాని నరేంద్ర మోదీకి మణిపూర్ మన దేశంలో భాగంగానే

..మిగతా |2| లో



## రేవంత్..
## కొంచెం తగ్గు

- నోటికొచ్చినట్టు మాట్లాడొద్దు
- సంయమనం పాటించాలి
- నువ్వేం హీరోవి కాదు..
- మంత్రి నిరంజన్ రెడ్డి కౌంటర్

**విశాలభారతి, హైదరాబాద్:** ఏది మాట్లాడినా చెల్లుబాటు అవుతుందనుకుంటే కుదరదని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. హైదరాబాద్‌లో బుధవారం మంత్రి నిరంజన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఒక రాజకీయ పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడు సంయమనం పాటించాలని సూచించారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే అది దేనికైనా దారితీయొచ్చని రేవంత్‌ను హెచ్చరించారు.కేసీఆర్ సర్కారు తెలంగాణ రైతులకు ఇస్తున్న కరెంట్‌పై చేసిన వ్యాఖ్యలు బెడిసికొట్టడంతో రేవంత్‌రెడ్డి సహనం

..మిగతా |2| లో



## కాంగ్రెస్ మజ్లిస్ బీఆర్‌ఎస్ ఒక్కటే
### వ్యతిరేక ఓటును చీల్చేందుకు కుట్ర:కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్,విశాలభారతి :** కాంగ్రెస్ మజ్లిస్ బీఆర్‌ఎస్ ఒక్కటే అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. బుదవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కొంతకాలంగా తెలంగాణ ప్రజలను మభ్యపెట్టేందుకు.. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలు తీవ్రంగా కృషిచేస్తున్నాయి. బీఆర్‌ఎస్ వ్యతిరేక ఓటును చీల్చి వారికి లబ్ధి చేకూర్చేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ రెండు పార్టీలకు ఏకైక ఎజెండా.. బీజేపీని ఓడించడం.. మోదీ వ్యతిరేకించడమని విమర్శించారు. మీడియా ముందు ఒకరినొకరు తిట్టుకుంటున్నా.. తెరవెనుక కలిసే పనిచేస్తున్నారు. వీరి నాటకాలను ప్రజలు గమనిస్తున్నారు. కేటీఆర్ మాట్లాడుతూ.. బీజేపీని

..మిగతా |2| లో

## కేంద్రం సహకరించకపోయినా
## తెలంగాణ అభివృద్ధి సాధిస్తోంది

**-లోక్‌సభలో ఎంపీ నామా**



**న్యూఢిల్లీవిశాల భారతి:** తెలంగాణ పట్ల మోదీ సర్కారు వివక్ష చూపిస్తోందని భారాస ఎంపీ నామా నాగేశ్వరరావు విమర్శించారు. నవోదయ విద్యాలయాల కోసం ఎన్నో సార్లు లేఖలు రాసినా ప్రయోజనం

..మిగతా |2| లో

## బీజేపీని గల్లాపట్టి గల్లీలో నిలదీయాలి..

### డిపాజిట్లు గల్లంతు చేసి మోదీకి బుద్ధి చెప్పాలి
### పెట్రోల్, డీజిల్ ధరలు పెరగటం వల్లే నిత్యావసరాల ధరలు పెరిగాయి
### కేసీఆర్ ఆశీర్వాదంతో నిజామాబాద్ అభివృద్ధి
### రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్



**నిజామాబాద్ బ్యూరో-విశాల భారతి:** బీజేపీని గల్లా పట్టి గల్లీలో నిలదీయాలని.. డిపాజిట్లు గల్లంతు చేసి మోదీకి బుద్ధి చెప్పాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ విమర్శించారు. అభివృద్ధి చేసే వారిని కులమతాలకు అతీతంగా గెలిపించాలని.. ఎన్నికలప్పుడు మాత్రమే వచ్చే వారిని ప్రజలు అసలు నమ్మొద్దని అన్నారు. నిజామాబాద్‌లో ఐటీ టవర్‌ను ప్రారంభించిన.. అనంతరం పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో జరిగిన బీఆర్‌ఎస్ పార్టీ సభలో పాల్గొని ప్రసంగించారు. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని దాశరథి జైల్లో బొగ్గుతో రాశారని.. అలాంటి పట్టణానికి రూ.50 కోట్లతో కళాభారతి నిర్మిస్తామని మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు. ఒకప్పుడు నెర్రలు వారిన నేలల్లో నేడు జలధారలు పారుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. ధాన్యం ఉత్పత్తిలో పంజాబ్‌ను అధిగమించామని.. ఇక్కడ ధాన్యం ఉత్పత్తి 60 వేల టన్నుల నుంచి 3.5 లక్షలకు చేరిందని ఆనందించారు. గత 60 ఏళ్లలో చూడని

..మిగతా |2| లో

## ఇంజినీరింగ్ తుది విడత సీట్లు కేటాయింపు

### కన్వీనర్ కోటాలో 70,627 సీట్లు భర్తీ .. ఇంకా మిగిలిపోయిన 13,139 సీట్లు
### తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వెల్లడి

**తెలంగాణ బ్యూరోవిశాల భారతి:** ఇంజినీరింగ్ తుది విడత సీట్లు కేటాయింపు ప్రక్రియను పూర్తి చేసినట్లు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి పేర్కొంది. ఇంజినీరింగ్ కన్వీనర్ కోటాలో 70,627 సీట్లను భర్తీ చేసినట్లు తెలిపింది. ఆ సీట్లను భర్తీ చేయగా ఇంకా కన్వీనర్ కోటాలో 13,139 సీట్లు మిగిలిపోయినట్లు ఉన్నత విద్యా మండలి స్పష్టం

..మిగతా |2| లో

# విపక్షాల వల్లే మణిపూర్ ఘటన

మొదటిపేజీ తరువాయి

ఇచ్చి ప్రభుత్వాలను నిలబెట్టుకుందని విమర్శించారు. మణిపూర్‌లో హింసాకాండపైనా అమిత్ షా మాట్లాడారు. మణిపూర్‌లో హింసాత్మక ఘటనలు జరిగాయన్న విషయాన్ని తాను అంగీకరిస్తున్నట్లు చెప్పారు. అలాంటి ఘటనలకు ఎవరూ మద్దతివ్వరని స్పష్టం చేశారు. ఇలాంటి వాటిపై రాజకీయాలు చేయడమే అవమానకరమని విపక్షాలనుద్దేశించి విమర్శలు గుప్పించారు. సమావేశాల మొదటి రోజు నుంచి మణిపూర్ అంశంపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు అమిత్ షా చెప్పారు. విపక్షాలే చర్చను జరగనీయలేదని ఆరోపించారు. హింసలో పాల్గొన్న మైతేయీ, కుకీ తెగలతో తాను వేర్వేరుగా చర్చలు జరుపుతున్నానని అమిత్ షా వివరించారు. ఇరువర్గాలు శాంతియుతంగా ఉండాలని పిలుపునిచ్చారు. చర్చలే సమస్యకు పరిష్కారమని స్పష్టం చేశారు. "నేను మణిపూర్ అంశంపై మాట్లాడకూడదని విపక్షాలు కోరుకున్నాయి. కానీ వారు నన్ను నిశబ్దంగా ఉంచలేరు. 130 కోట్ల మంది ప్రజలు మమ్మల్ని గెలిపించారు. కాబట్టి వారు తప్పక వినాల్సిందే. గడిచిన ఆరేళ్లలో మణిపూర్‌లో కర్ఫ్యూ విధించే అవసరమే రాలేదు. భారత్, మయన్మార్ మధ్య సరిహద్దుల్లో ఎలాంటి కంచె లేకపోవడం వల్ల మయన్మార్ నుంచి శరణార్థులు స్వేచ్ఛగా వస్తున్నారు. సైనికుల పహారాతో మణిపూర్‌లో పరిస్థితులు చక్కబడ్డాయి. వేలాదిగా వలసలు రావడం వల్ల స్థానికుల్లో అభద్రతా భావం నెలకొంది. 1993లో 700 మంది ప్రజలు నాగా కుకీ ఘర్షణల్లో చనిపోయారు. అప్పుడు ప్రధాని, హోంమంత్రి కాకుండా.. హోంశాఖ సహాయ మంత్రి పార్లమెంట్‌లో ప్రకటన చేశారు. నెహ్రూ, ఇందిర, రాజీవ్ గాంధీ హయాంలోనే మతపరమైన అల్లర్లు ఎక్కువ జరిగాయి. దేశ ప్రజల్లో భ్రమను కల్పించేందుకే ప్రతిపక్ష ఇండియా కూటమి కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిందని షా విమర్శించారు. ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని ప్రజలు రెండుసార్లు గెలిపించారని గుర్తు చేసిన ఆయన.. మోదీ అత్యంత విజయవంతమైన ప్రధాని అని కొనియాడారు. దేశ ఖ్యాతిని పెంచేందుకు మోదీ పనిచేశారని వ్యాఖ్యానించారు.

## అప్పుడు హగ్ ఇచ్చి, కన్ను కొట్టి..

# ఇప్పుడు ఫ్లయింగ్ కిస్...

మొదటిపేజీ తరువాయి

ప్రసాద్ తీవ్రంగా మండిపడ్డారు. మహిళా ఎంపీలు కూర్చున్న చోట అలాంటి పని చేయడం అవమానకరమంటూ వ్యాఖ్యానించారు. రాహుల్ ఫ్లయింగ్ కిస్ ఇవ్వడం తమ సంస్కృతికి వ్యతిరేకమని కేంద్ర మంత్రి దర్శనా జర్దోశ్ పేర్కొన్నారు.

**'రాహుల్‌ను టీవీలో చూపించరా?'**

పార్లమెంట్ సమావేశాలను ప్రత్యక్ష ప్రసారం చేసే సంసద్ టీవీ.. రాహుల్ ప్రసంగిస్తుండగా స్పీకర్‌ను చూపించడంపై కాంగ్రెస్ నేతలు విమర్శలు గుప్పించారు. అవిశ్వాస తీర్మానంపై ఆయన 37 నిమిషాలు మాట్లాడితే 14 నిమిషాల 37 సెకన్ల పాటు మాత్రమే సంసద్ టీవీ.. రాహుల్‌ను స్క్రీన్‌పై చూపించిందని జైరాం రమేశ్ విమర్శించారు. రాహుల్‌ను చూసి మోదీ ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు.

# మణిపూర్ సాక్షిగా భరతమాతను హత్యచేశారు

మొదటిపేజీ తరువాయి

కనిపించడం లేదు. ఆ రాష్ట్రంలో ఇండియాని బీజేపీ హత్య చేసింది. మణిపూర్ రెండు ముక్కలుగా చీలిపోయిందనేది వాస్తవం. అసలు ఇప్పుడా రాష్ట్రం ఉనికే కనిపించడం లేదు. బీజేపీ ఎంపీలు మమ్మల్ని రాజస్థాన్‌కి వెళ్లమని సలహా ఇచ్చారు. నేను వెళ్తున్నాను. ప్రధాని మోదీ రావణాసురుడిగా మారిపోయారు. మొత్తం దేశాన్ని తగలబెడుతున్నారు. ముందు మణిపూర్‌తో మొదలుపెట్టారు. ఇప్పుడు హరియాణాలో ఇదే జరుగుతోంది. దేశం మొత్తాన్ని ఇలా తగలబెట్టాలనుకుంటున్నారు" భరత మాతపై రాహుల్ చేసిన వ్యాఖ్యలపై స్పీకర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. నోరు జారకూడొద్దంటూ మందలించారు. భరత మాతపై రాహుల్ చేసిన వ్యాఖ్యలపై స్పీకర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. నోరు జారకూడొద్దంటూ మందలించారు.

కేంద్రమంత్రి స్మృతి ఇరానీ కూడా రాహుల్ వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భరత మాతపై రాహుల్ అలాంటి వ్యాఖ్యలు చేస్తే కాంగ్రెస్ ఎంపీలు చప్పట్లు కొట్టడం సిగ్గుచేటు అంటూ మండి పడ్డారు. ఆ పార్టీ వైఖరేంటో దీంతో తేలిపోయిందని తేల్చి చెప్పారు. రాహుల్ గాంధీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.



# బీజేపీని గల్లాపట్టి గల్లీలో నిలదీయాలి..

మొదటిపేజీ తరువాయి

వాటిని ఈ 9 ఏళ్లలో చూస్తున్నామన్నారు. పెద్దలకు గౌరవించడం హిందూ సంప్రదాయం, ఆధునికుల నాగరికత అని కేటీఆర్ హితబోధ చేశారు. అలాంటిది నిజామాబాద్ ఎంపీకి పెద్దలను గౌరవించటం కూడా తెలియదని విమర్శించారు. మతం గురించి మాట్లాడి రెచ్చగొట్టడం ఒక్కటే ఎంపీ అర్వింద్‌కు తెలుసని ధ్వజమెత్తారు. ప్రతిదానికి హిందూ, ముస్లిం అని మాట్లాడుతూ ప్రజల మధ్య విద్వేషాలు పెంచుతున్నారన్నారు. ఈసారి అర్వింద్ ఎక్కడ నుంచి పోటీ చేసిన డిపాజిట్లు గల్లంతు అవ్వడం ఖాయమని హెచ్చరించారు. గ్యాస్ సిలిండర్ ధర రూ.450 ఉన్నప్పుడు సిలిండర్‌కు మొక్కాలని ఆనాడు మోదీ అన్నారని.. కానీ ఇవాళ అదే సిలిండర్ ధర రూ.1200కు మోదీ పెంచారని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరగటం వల్లే అన్ని నిత్యావసరాల ధరలు పెరిగాయని మంత్రి కేటీఆర్ హెచ్చరించారు. కాంగ్రెస్ వాళ్లు కూడా కేసీఆర్ మీద ఎగబడి మాట్లాడుతున్నారని.. కొత్తగా ఒక్కసారి అవకాశం ఇవ్వాలని అంటున్నారని ఎద్దేవా చేశారు. 50 ఏళ్లు అధికారంలో ఉన్నది వాళ్లే కదా అని మంత్రి కేటీఆర్ గుర్తు చేశారు.

**కేసీఆర్ ఆశీర్వాదంతో నిజామాబాద్ అభివృద్ధి**

సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతోనే నిజామాబాద్ నగరం అభివృద్ధి జరిగిందని మంత్రి కేటీఆర్ అన్నారు. రూ.50 కోట్లతో ఐటీ హబ్ నిర్మించి స్థానికులకు ఉద్యోగాలు కల్పించామన్నారు. రూ.11 కోట్లతో న్యాక్ భవనాన్ని నిర్మించామని తెలిపారు. భవన నిర్మాణ రంగంలో పని చేసేవారికి ఉచిత శిక్షణ ఇచ్చేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతోందని వివరించారు. రూ.7 కోట్లతో నిజామాబాద్ మున్సిపల్ భవనాన్ని నిర్మించామని.. హైదరాబాద్‌లో ట్యాంక్ బండ్‌ను తలపించేలా రఘునాథ చెరువును మినీ ట్యాంక్ బండ్‌ను తీర్చిదిద్దామని తెలిపారు. రూ.17.5 కోట్లతో మూడు వైకుంఠదామాలను అత్యంత సుందరంగా తీర్చిదిద్దామని కేటీఆర్ వెల్లడించారు.

# రేవంత్.. కొంచెం తగ్గు

మొదటిపేజీ తరువాయి

కోల్పోయి మాట్లాడుతున్నారని, ఇష్టారీతిన మాట్లాడితే హీరో అయిపోతానని రేవంత్ తనకు తాను ఊహించుకుంటున్నాడన్నారు. కానీ, రేవంత్‌రెడ్డి వాడే భాషను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలే జీర్ణించుకోలేకపోతున్నారని చెప్పారు. సీఎం కేసీఆర్‌ను పొరుగు రాష్ట్రాల ప్రజలు కూడా మెచ్చుకుంటున్నారని ఈ సందర్భంగా మంత్రి నిరంజన్‌రెడ్డి గుర్తుచేశారు. సీఎం కేసీఆర్‌తో సిద్ధాంతపరంగా పోరాడాలి కానీ, వ్యక్తిగత ద్వేషంతో కాదని రేవంత్‌కు సూచించారు.

# 'భోళాశంకర్'కు ఏపీ సర్కారు షాక్

- టికెట్ల ధరలు పెంచుకొనేందుకు నో పర్మీషన్
- చిరంజీవి వ్యాఖ్యలతో ప్రభుత్వం రివెంజ్?



**విశాలభారతి, ఏపీ:** మెగాస్టార్ చిరంజీవి ఫ్లోలో నోరు జారారో లేక ఉద్దేశపూర్వకంగా ఏపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారో తెలియదు కానీ, ఆయన నటిస్తున్న లేటెస్ట్ మూవీ భోళా శంకర్‌పై ఆ వ్యాఖ్యల ఎఫెక్ట్ పడుతోంది. ఏపీలో సినిమా బడ్జెట్ ను బట్టి మూవీ విడుదల సమయంలో టికెట్ రేట్లు పెంచుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. కొన్నేళ్లుగా సినిమా విడుదల సమయంలో నిర్మాతలు ప్రభుత్వం అనుమతి పొంది టికెట్ రేట్లు పెంచుకుంటున్నారు. అలాగే అదనపు షోలకు కూడా పర్మిషన్ తీసుకుంటున్నారు. రెండు రోజుల్లో చిరంజీవి హీరోగా నటించిన భోళా శంకర్ సినిమా విడుదల కానుంది. తొలి రెండు మూడు రోజులు తమ సినిమా టికెట్ ధర పెంచుకోవడానికి అనుమతి ఇవ్వాలని ఇప్పటికే ఆ మూవీ నిర్మాతలు ప్రభుత్వాన్ని అనుమతి కూడా కోరారు.

మామూలుగా అయితే అగ్ర హీరోలు నటించిన సినిమాలు విడుదల అవుతున్న సమయంలో టికెట్ ధరలు పెంచుకునే విషయమై ప్రభుత్వాన్ని అనుమతి కోరగానే వెంటనే లభిస్తోంది. అయితే ఇప్పుడు భోళా శంకర్ సినిమా టికెట్ల ధరలు పెంచుకోవడానికి ప్రభుత్వం అనుమతించలేదని ప్రచారం జరుగుతోంది. ఒకవైపు సినిమా విడుదలకు గంటలే మిగిలి ఉండగా ప్రభుత్వ వైఖరి నిర్మాతలకు టెన్షన్ పుట్టిస్తోంది.

బుక్ మై షో వంటి యాప్ లలో టికెట్లు విడుదల చేయాల్సి ఉండగా.. ప్రభుత్వ నిర్ణయం నిర్మాతలను ఆందోళనలో పడేస్తోంది. టికెట్ రేట్ల పెంపునకు సంబంధించి నిర్మాతలు తమను సంప్రదించిన మాట వాస్తవమేనని ప్రభుత్వ వర్గాలు ధ్రువీకరిస్తున్నాయి. అయితే అప్లికేషన్ అసంపూర్తిగా ఉందని, పలు డాక్యుమెంట్లు సమర్పించలేదని ప్రభుత్వం భోళా శంకర్ సినిమా టికెట్ల ధరలు పెంచుకోవడానికి అనుమతి ఇవ్వలేదు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా చిరంజీవి వ్యాఖ్యలు చేసిన ఫలితంగానే ఇప్పుడు ఈ పరిస్థితి నెలకొందని సినీ ఇండస్ట్రీలో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఏది ఏమైనా ప్రభుత్వంపై చిరంజీవి చేసిన వ్యాఖ్యలు నిర్మాతలను ఇబ్బందుల్లో పడేశాయనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. రేపటిలోగా టికెట్ల ధరలు పెంచుకునేందుకు ప్రభుత్వం అనుమతించకపోతే భోళా శంకర్ సినిమా భారీగా నష్టపోయే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అంటున్నారు.

# కాంగ్రెస్ మజ్లిస్ బీఆర్ఎస్ ఒక్కటే

మొదటిపేజీ తరువాయి

ఓడించేందుకు, బీజేపీ వ్యతిరేక కూటమితో కలిసి పోరాడతామని అన్నారు. సంకీర్ణ ప్రభుత్వంలో కీలకంగా ఉంటామని కేటీఆర్ అన్నారని గుర్తు చేశారు. బీజేపీ వ్యతిరేక కూటమిలో.. అదీ కాంగ్రెస్ నేతృత్వంలోని సంకీర్ణంలో చేరేందుకు బీఆర్ఎస్ ఆలోచిస్తోందని తెలిపారు. వారందరూ ఒక్కటే అని చెప్పేందుకు ఇదొక ఉదాహరణ మాత్రమే. కేసీఆర్ అసెంబ్లీలో మాట్లాడుతూ.. 'మాది సెక్యులర్ పార్టీ' అంటున్నాడు. అదే సమయంలో.. మజ్లిస్ తో మాకు దోస్తానా ఉంది అంటున్నాడు. అంటే మజ్లిస్ పార్టీ 'సెక్యులర్ పార్టీ' అని సర్టిఫికెట్ ఇస్తున్నరా అని ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. 15 నిమిషాలు సమయం ఇస్తే.. ఏం అవుతుదుంతో చూడండి అన్న మతోన్మాదిని పక్క సీట్లో కూర్చోబెట్టుకుని.. వారితో దోస్తీ చేస్తున్న మీరు 'సెక్యులర్' పార్టీనా? అలాంటి పార్టీతో దోస్తీ మీరెందుకు చేస్తున్నరో తెలంగాణ ప్రజలకు తెల్వదా? దీనికి కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మజ్లిస్ ను పెంచి పోషించింది కాంగ్రెస్ పార్టీయే ఇప్పుడు బీఆర్ఎస్‌కాంగ్రెస్ మధ్య దోస్తీ కోసం మధ్యవర్తిత్వం చేస్తున్నది మజ్లిస్ పార్టీ.వీళ్లంతా ఒకరికొకరు సహకరించడాన్ని తెలంగాణ ప్రజలు చూస్తున్నరని తెలిపారు. కాంగ్రెస్ హయాంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో నాటి టీఆర్ఎస్ పార్టీ మంత్రిపదవులు అనుభవించింది. స్వయానా ముఖ్యమంత్రి కేసీఆరే.. మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారని గుర్తు చేసారు.

**కాంగ్రెస్ - మజ్లిస్ - బీఆర్ఎస్ ఒక్కటే**

పార్లమెంటులో కలిసే మాట్లాడతరు.. పార్లమెంటులో కలిసే అవిశ్వాస తీర్మానం చేస్తరు.. తెలంగాణలో 2014లో 22 మంది కాంగ్రెస్ నుంచి గెలిస్తే.. 15 మంది టీఆర్ఎస్ గడీలోకి పోలేదా? రెండోసారి.. 19 గెలిస్తే.. 12 మంది గులాబీ కండువా కప్పుకోలేదా? అని అన్నారు. ఎందుకో కాంగ్రెస్ నేతలు చప్పుడు చేయలేదు. కాంగ్రెస్ రాష్ట్రపతి అభ్యర్థి యశ్వంత్ సిన్హా ను సీఎం కేసీఆర్ హైదరాబాద్ కు పిలిపించి భారీ బైక్ ర్యాలీ, కార్ ర్యాలీ నిర్వహించలేదా? మణిపూర్ లో భారతమాత హత్య జరిగిందని.. ఓ నాయకుడు ఇవాళ పార్లమెంటులో అన్నాడు.భారతమాత ను చిత్రహింసలు పెట్టేందుకు కుశులు, హూణులు మొదలుకుని.. ఘోరీలు, గజనీలు.. మొగలులు, పోర్చుగీసు వాళ్లు, ఆంగ్లేయులు.. మొన్నమొన్నటి వరకు కాంగ్రెస్ పార్టీ వాళ్లు.. ఎన్నో కుట్రలు, కుతంత్రాలు పన్నారు. కానీ నా దేశాన్ని, నా నాగరికతను ఏమీ చేయలేకపోయారు. ఇవాళ అవిశ్వాస తీర్మానం సందర్భంగా బీఆర్ఎస్ ఎంపీ మాట్లాడుతూ.. ఎన్నిసార్లు లేఖలు రాసినా కేంద్రం స్పందించడం లేదన్నడు. రాష్ట్రం అడిగినా, అడగకపోయినా.. కేంద్రం వివిధ కార్యక్రమాలు, అభివృద్ధి పథకాలను ఇస్తుంటే.. మీకు కనిపించడం లేదా? నేను ముఖ్యమంత్రికి ఎన్ని లేఖలు రాసినా.. మీరు ఇస్తున్న స్పందన ఏంది? పార్లమెంటు వేదికగా.. అబద్ధాలు మాట్లాడిన టీఆర్ఎస్ నాయకులు.. తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలె.






# తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేయాలి..

- తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి కాసాని వీరేష్..
- తెలుగుదేశం పార్టీ అనుబంధ విభాగమైన ఎస్టీ సెల్ ప్రమాణ స్వీకారం...

**హైదరాబాద్,విశాల భారతి:** తెలుగుదేశం పార్టీ బలోపేతం చేయడానికి అన్ని అనుబంధ విభాగాలు కృషి పట్టుదలతో పని చేయాలని జాతీయ తెలుగుదేశం పార్టీ కార్యదర్శి కాసాని వీరేష్ పేర్కొన్నారు.బుధవారం తెలుగుదేశం పార్టీ అనుబంధ విభాగమైన ఎస్టీ సెల్ ప్రమాణ స్వీకార కార్యక్రమం హైదరాబాద్ ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్లో నిర్వహించారు.గిరిజన విభాగం నూతన అధ్యక్షుడు గా కే.గోపి ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాసాని వీరేష్ హాజరై మాట్లాడారు... గిరిజనుల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు తెలుగుదేశం పార్టీ ఎన్టీఆర్ చేపట్టారని గుర్తు చేశారు. ఇప్పటి వరకు తెలుగుదేశం పార్టీలో గిరిజనులకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చిందన్నారు.పార్టీ కార్యకర్తలంతా పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లో పార్టీకి బలమైన కార్యకర్తలు ఉన్నారని,పార్టీకి అంకిత భావంతో పనిచేసే వారికి తెలుగుదేశం పార్టీ ప్రత్యేక గుర్తింపు ఇస్తుందన్నారు .గతంలో కార్యకర్తగా పనిచేసిన అందరికీ ఇప్పుడు లీడర్ లు అయ్యారని తెలిపారు.భవిషత్తు లో కూడా మీరు మంచి నాయకులుగా గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శులు అజ్మీరా రాజు నాయక్,

ఆరీఫ్, జివిజి నాయుడు,రాష్ట్ర పార్టీ కార్య నిర్వహక కార్యదర్శులు పెద్దోజు రవీంద్ర చారి, మండూరి సాంబశివరావు, బిక్షపతి ముదిరాజ్, రేజండ్ల కిషోర్, తెలుగు మహిళా అధ్యక్షురాలు షకీలారెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ అధ్యక్షుల కె. అశోక్ కుమార్ గౌడ్,నల్లగొండ పార్లమెంట్ అధ్యక్షులు కశిరెడ్డి శేఖర్ రెడ్డి మహబూబ్ నగర్ పార్లమెంట్ అధ్యక్షులుఎం.శ్రీనివాస్‌ముదిరాజ్, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు కె. జోగేందర్ సింగ్, నియోజకవర్గ ఇన్చార్జులు మధవి లత ,చక్రపాణి, కట్ట వెంకటేష్ గౌడ్, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యవర్గ సభ్యుల తదితరులు పాల్గొన్నారు.





# ఇంజినీరింగ్ తుది విడత సీట్లు కేటాయింపు

మొదటిపేజీ తరువాయి

చేసింది. ఆ మిగిలి న సీట్ల భర్తీకి ఈ నెల 17 నుంచి ప్రత్యేక విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రంలో తొలి విడత ఇంజినీరింగ్ సీట్ల భర్తీని గత నెలలోనే ఉన్నత విద్యామండలి పూర్తి చేసింది. మొదటి విడత కౌన్సెలింగ్‌లో 70,665 ఇంజినీరింగ్ సీట్లను భర్తీ చేశారు. సీట్లు పొందిన అభ్యర్థులు జులై 22న సెల్ఫ్ రిపోర్టింగ్ చేశారు. దీంతో 85.48 శాతం సీట్లు భర్తీ అయినట్లు ఉన్నత విద్యామండలి పేర్కొంది. మొదటి విడతలో మూడు యూనివర్సిటీలు, 28 ప్రైవేటు కళాశాలల్లో సీట్లన్నీ నిండిపోయాయి. కంప్యూటర్ సైన్స్‌కు సంబంధించిన కోర్సుల్లో 94.20 శాతం సీట్ల కేటాయింపు పూర్తి అయింది. ఈఈఈలో 58.38 శాతం, సివిల్‌లో 44.76 శాతం, మెకానికల్‌లో 38.50 శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. దీంతో ఈ ఏడాది కూడా కోర్ గ్రూప్‌లకు ఆదరణ బాగా కరువైంది. ఇంజినీరింగ్ రెండో విడత సీట్ల పంపిణీ ప్రక్రియలో కన్వీనర్ కోటాలో 7,417 మందికి సీట్లు దక్కగా.. మరో 25,148 మంది కళాశాల లేదా కోర్సులను మార్చుకున్నారు. రెండో విడతలో కన్వీనర్ కోటాలో 12,013 సీట్లు మిగిలాయి. దీంతో 82,702 సీట్లు కన్వీనర్ కోటాలో ఉండగా.. 70,689 సీట్లు భర్తీ అయ్యాయి. ఈ సీట్లు పొందిన అభ్యర్థులు ఆగస్టు 2వ తేదీన ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేశారు. కొన్ని కోర్సుల్లో అసలు ఒక్క సీటు కూడా నిండలేదు.



# కేంద్రం సహకరించకపోయినా తెలంగాణ అభివృద్ధి సాధిస్తోంది

మొదటిపేజీ తరువాయి

లేకుండా పోయిందన్నారు. యూపీఏ ప్రభుత్వం మంజూరు చేసిన ఐటీఐఆర్ ప్రాజెక్టును మోదీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. తెలంగాణ కూడా దేశంలో భాగమే కదా అని అని నిలదీశారు. ఈ మేరకు లోక్‌సభలో అవిశ్వాస తీర్మానంపై జరిగిన చర్చలో భాగంగా నామా నాగేశ్వరరావు మాట్లాడారు.'హర్ ఘర్ జల్ పథకం కింద అన్ని రాష్ట్రాలకు కేంద్రం నిధులు ఇస్తోంది. ఇంటింటికీ నల్లా ద్వారా మంచినీరు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ. పెద్ద రాష్ట్రాల్లో ఎక్కడైనా ఇంటింటికీ మంచినీరు ఇస్తోందా? సాగుకు 24 గంటల విద్యుత్ ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ. ధాన్యం దిగుబడిలో పంజాబ్‌ను తెలంగాణ అధిగమించింది. రాష్ట్రానికి రూ.24 వేల కోట్లు ఇవ్వాలని నీతి ఆయోగ్ సిఫార్సు చేసినప్పటికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. విభజన చట్టం హామీలను నెరవేర్చాలని 9 ఏళ్లుగా కోరుతున్నాం. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ మంజూరు చేయాలని ఎన్నోసార్లు అడిగాం. కోచ్ ఫ్యాక్టరీలను మహారాష్ట్ర, గుజరాత్‌కు ఇచ్చి మాకు రిపేర్ ఫ్యాక్టరీ ఇచ్చారు. తెలంగాణలో ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కోరాం. తెలంగాణకు మెడికల్ కళాశాలలు, నవోదయ విద్యాలయాలు ఇవ్వట్లేదు. కేంద్రం సహకరించకపోయినా తెలంగాణ అభివృద్ధి సాధిస్తోంది. చిన్న రాష్ట్రాల పట్ల మోదీ సర్కారు తీరు సరిగా లేదు. అన్ని రాష్ట్రాలను సమానంగా చూడాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం' అని లోక్‌సభలో నామా వెల్లడించారు.

# గృహ లక్ష్మి పథకం దరఖాస్తు కి నెల రోజుల సమయం ఇవ్వాలి

- సీపీఎం మండల కార్యదర్శి షేక్ యాకూబ్



గరిడేపల్లి,విశాలభారతి :గృహ లక్ష్మి పథకం దరఖాస్తు కి నెల రోజుల సమయం ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి షేక్ యాకూబ్ అన్నారు.వైన్ షాప్ టెండర్లకు 15 రోజుల సమయం ఇచ్చి , ఈ పథకానికి మాత్రం కేవలం 4 రోజుల సమయం ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. అంతే కాకుండా వైన్ షాప్ టెండర్ వేయడానికి ఆధార్ కార్డు ఉంటే సరిపోతుందని చెప్పిన ప్రభుత్వం , గృహ లక్ష్మి పథకానికి మాత్రం కుల,ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు.కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు మండల కార్యాలయం నుంచి రావడానికి 7 రోజుల సమయం పట్టే అవకాశం ఉందని, అలాంటిది 4 రోజులలో ఎలా దరఖాస్తు చేసుకుంటారని అన్నారు. రాష్ట్రం ఏర్పడ్డప్పుడు సమగ్ర సర్వే చేసిన ప్రభుత్వానికి రాష్ట్రంలోని ప్రజలందరి ఆర్థిక పరిస్థితి తెలుసని, అలాంటిది ఇప్పుడు కుల,ఆదాయ సర్టిఫికెట్ల సంగతి ఎందుకని అన్నారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు ఉంటే దరఖాస్తు స్వీకరించాలని , అంతే కాకుండా దరఖాస్తు చేసుకున్న ప్రతి పేదవాడికి ఇల్లు ఇవ్వాలని లేనియెడల ప్రజాగ్రహాన్ని చవిచూడవలసి వస్తుందని యాకూబ్ అన్నారు.

# కృష్ణ స్వామి కాస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి..

- జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి.
- తెలంగాణ ముదిరాజ్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టి యాదగిరి.



**ముషీరాబాద్,విశాల భారతి:** పేద ప్రజల అభ్యున్నతికి కృష్ణస్వామి నిరంతరం కృషి చేశారని ఆయన కాస్య విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయాలని తెలంగాణ ముదిరాజ్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టి యాదగిరి ముదిరాజ్ కోరారు. నగర మేయర్ గా సమాజ సేవ దృక్పథంతో మతసామరస్య సంస్థలను స్థాపించి ప్రజాధరణ పొందరని తెలిపారు. ఈ నెల 25న జరిగే కృష్ణస్వామి జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని బుధవారం రాష్ట్ర సెక్రటేరియట్లో మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమ్మద్ అలీ, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ను కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆగస్టు 25న కృష్ణ స్వామి 130 వ జయంతి వేడుకలను సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంబర్పేట్ లో ఘనంగా నిర్వహిస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వం కూడా అధికారికంగా నిర్వహించాలని కోరారు. ఈ జయంతి వేడుకలకు ముదిరాజ్ యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మంత్రులను కలిసిన వారిలో సంఘం రాష్ట్ర నాయకులు చింతల నవీన్, సతీష్, డొప్ప అంజయ్య, తూర్పు రామచందర్, కొరివి లక్ష్మణ్, బాల్రాజ్, చింతల సత్యనారాయణ, మహేష్ ముదిరాజ్, శ్రీరాములు ముదిరాజ్, అనంతయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# తొర్రూర్ బోనాల పండుగ వేడుకల్లో పాల్గొన్న ఇన్చార్జి హనుమాన్ల ఝాన్సీ రెడ్డి



**తొర్రూర్ విశాల భారతి:** తొర్రూరు పట్టణ కేంద్రంలో బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి హనుమాన్ల ఝాన్సీ రెడ్డి పాల్గొని మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నిరంజన్ రెడ్డి తొర్రూర్ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, కౌన్సిలర్లు తూనం రోజా, భూసాని రాము చింతల రాజు చంటి తదితరులు పాల్గొన్నారు.



# మంత్రి ఎర్రబెల్లిని కలిసిన సింగరాజుపల్లి గౌడ సంఘం నాయకులు

**దేవరుప్పుల, విశాల భారతి:** దేవరుప్పుల మండలం, సింగరాజుపల్లి గ్రామానికి చెందిన గౌడ సంఘం నాయకులు బుధవారం హన్మకొండ ఆర్&బి గెస్ట్ హౌస్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును మర్యాద పూర్వకంగా కలిశారు. సింగరాజుపల్లి గ్రామానికి గౌడ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ. 10 లక్షలు, శ్రీ కంఠమహేశ్వర స్వామి దేవస్థానం గుడి నిర్మాణం కోసం రూ. 5 లక్షలు మంజూరు చేయాలని కోరగా మంత్రి తక్షణమే స్పందించి మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. సింగరాజుపల్లి గ్రామ ప్రజాప్రతినిధులు, గౌడ సంఘం నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, మంత్రి ఎర్రబెల్లికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ లింగాల రమేష్ రెడ్డి, గ్రామ సర్పంచ్ గోపాల్ దాస్ మల్లేష్, బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షులు మేకపోతుల నరసింహ గౌడ్, గౌడ పెద్ద మనుషులు వడ్లకొండ సోమయ్య గౌడ్, వడ్లకొండ పద్మయ్య గౌడ్, అతికం మల్లయ్య గౌడ్, దాసగాని బిక్షపతి గౌడ్, అతికం పెద్ద అంజయ్య గౌడ్, ఆతికం చిన్న అంజయ్య గౌడ్, దేవరుప్పుల మండలం యూత్ అధ్యక్షులు భానోత్ నవీన్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

**తొర్రూర్ విశాల భారతి:** బుధవారం తొర్రూరు మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ 63వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి గారు కేక్ కట్ చేసి యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఝాన్సీ రెడ్డి గారు మాట్లాడుతూ యువజన కాంగ్రెస్ అనేది కాంగ్రెస్ పార్టీకి వెన్నుముక్క లాంటిదని, ప్రభుత్వం మీద పోరాటం చేయటంలో ప్రజల పక్షాన పోరాటాలు చేయడంలో లాఠీలకు తూటాలకు భయపడకుండా రోడ్లమీద వచ్చి ప్రజల పక్షాన పోరాడే నికార్సైన నాయకులు అని అన్నారు. రాబోయే కాలంలో యువతకి అన్ని విధాలుగా సహకారం అందిస్తామని, ఈ పాలకుర్తి గడ్డమీద ఈసారి స్థానికేతరుడైన దయాకర్ రావును ఓటమితో సాగనంపడానికి యువజన కాంగ్రెస్ ముఖ్య భూమిక పోషించాలని అందుకు యువజన కాంగ్రెస్కు అన్ని విధాలుగా తోడుగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ధరావత్ రాజేష్ నాయక్, ఎన్ యస్ యు ఐ నియోజకవర్గ నాయకులు రాజేష్ యాదవ్, పాలకుర్తి, పెద్ద వంగర రాయపర్తి, కొడకండ్ల మండలాల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మాదాసు హరీష్ గౌడ్, హరికృష్ణ గౌడ్, మహమూద్, యాకేష్, తొర్రూరు యూత్ కాంగ్రెస్ నాయకులు అభిరామ్ నాయక్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గోనె మహేందర్ రెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



# తొర్రూర్ బోనాల పండుగ వేడుకల్లో పాల్గొన్న ఎర్రబెల్లి ఉషా దయాకర్ రావు

**తొర్రూర్ విశాల భారతి:** తొర్రూరు పట్టణ కేంద్రంలో బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగ వేడుకల్లో ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్ ఎర్రబెల్లి ఉషా దయాకర్ రావు పాల్గొని మొక్కులు చెల్లించారు. తొర్రూరు మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ పొనుగోటి సోమేశ్వరరావు, తొర్రూర్ మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, వైస్ చైర్మన్ జినుగ సురేందరెడ్డి, బిఆర్ఎస్ నాయకులు శామకూరి ఐలయ్య, బిజ్జాల అనిల్, ధరావత్ జైసింగ్, దొంగరి శంకర్, కర్నెనాగరాజు, జలీల్, సురేష్, పాల్గొన్నారు.

# తొర్రూర్ బోనాల పండుగలో పాల్గొన్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



**తొర్రూర్ విశాల భారతి:** తొర్రూర్ పట్టణ కేంద్రంలో బుధవారం జరిగిన బోనాల పండుగ వేడుకల్లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొర్రూర్ పట్టణ ప్రజలు ఆయు ఆరోగ్యాలతో ఉండాలని ముత్యాలమ్మ దేవతను ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో తొర్రూర్ మున్సిపాలిటీ పరిధిలోని టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



# దేశ వ్యాప్తంగా మేరీ మట్టి మేరీ దేశ్ కార్యక్రమాలు..

**దేవరుప్పుల, విశాల భారతి:** భారతదేశానికి స్వాతంత్ర్యం లభించి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా మేరీ మట్టి మేరీ దేశ్ (నా మట్టి నా దేశం) కార్యక్రమాన్ని దేవరుప్పుల మండల కేంద్రంలోని ధర్మపురం గ్రామంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి సూచనల మేరకు మేరీ మట్టి మేరీ దేశ్ నినాదంతో జిల్లా నాయకత్వం నెలవారి కార్యక్రమాలు చేపట్టింది. జాటోతు తాను నాయక్ తమ్ముడైన దర్గే నాయక్ ని సన్మించిన జనగామ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్ రెడ్డి , రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగ రామ్మోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిలు సౌడ రమేష్ శివరాజ్ యాదవ్ ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకులు ఎల్లయ్య, దేవరుప్పుల మండల అధ్యక్షుడు బాగాల నవీన్ రెడ్డి, తొర్రూరు రూరల్ అధ్యక్షుడు బొచ్చు సురేష్ యాదవ్, కొడకండ్ల మండల అధ్యక్షుడు పులిగిల్ల ఉపేందర్, దేవరుప్పుల ప్రధాన కార్యదర్శి కాసాని సత్తన్న, గణేష్, రమేష్, నరసింహ చారి రాజోజు పాల్గొన్నారు.



# డిసిపి వెంకటేశ్వర్లు ను తక్షణమే సస్పెండ్ చేయాలి

- విద్యార్థి నేతలపై దాడి ని ఖండిస్తున్నాం
- అప్రజాస్వామిక జీవో ను ఉపసంహరించుకోవాలి
- విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి.
- పి డి ఎస్ సి రాష్ట్ర ఉపాధ్యక్షులు గడ్డం శ్యామ్.

ఓయూ విశాల భారతి:
విద్యసంస్థల్లోకి విద్యార్థి సంఘాలను అనుమతి ఇవ్వోదంటు దేవసేన ఇచ్చిన జీవోను ఉపసంహరించుకోవాలని అదే విధంగా విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్
విద్యార్థి నేతలు నిర్వహించిన చలో సెక్రటేరియల్ నిర్వహించారు. ముట్టడి సందర్భంగా డీసీపీ వెంకటేశ్వర్లు అత్యుత్సాహం ప్రదర్శించి విద్యార్థి నేతలపై దాడి చేయడాన్ని పి డి ఎస్ సి రాష్ట్ర ఉపాధ్యక్షులు గడ్డం శ్యామ్ తీవ్రంగా ఖండించారు.
తెలంగాణ రాష్ట్రంలో ఎదుర్కొంటున్న విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని పిడిఎస్యు రాష్ట్ర ఉపాధ్యక్షులు గడ్డం శ్యామ్ డిమాండ్ చేశారు.దాడిని ఖండిస్తూ ఓయూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. అనంతరం శ్యామ్ మాట్లాడుతూ విద్యాసంస్థలోకి విద్యార్థి సంఘాలు మీడియాను అనుమతి ఇవద్దంటూ విద్యాశాఖ కార్యదర్శి దేవసేన ఇచ్చిన అప్రజాస్వామిక జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసుల దాడులను ఖండిస్తూ డీసీపీ వెంకటేశ్వర్లు ను తక్షణమే సస్పెండ్ చేసి, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.



# పవర్ లిఫ్టింగ్ లో ప్రదీప్ కుమార్ కు గోల్డ్ మెడల్

**అభినందించిన రాచకొండ పోలీస్ కమిషనర్ దేవేందర్ సింగ్ చౌహాన్.**

**హైదరాబాద్ విశాల భారతి:** ఇండియన్ పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్ నిర్వహించిన రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ 2023 పోటీల్లో రాచకొండ పోలీస్ కమిషనరేట్ కార్యాలయం లో అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసరుగా పనిచేస్తున్న పి .ప్రదీప్ కుమార్ కు గోల్డ్ మెడల్ లభించింది. ఈ నెల 6న హైదరాబాద్ గన్ ఫౌండ్రీ లో నిర్వహించిన 83 కిలోల కేటగిరీ లో మొత్తం 400 కిలోలు (160 కిలోల డెడ్ లిఫ్ట్, 80 కిలోల బెంచ ప్రెస మరియు 160 కిలోల స్క్వాట్) బరువును ఎత్తి మొదటి స్థానం తో పాటు గోల్డ్ మెడల్ సాధించారు. ఈ సంవత్సరం ఆగష్టు నెలలో జార్ఖండ్ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే అఖిల భారత పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రాచకొండ పోలీస్ కమిషనర్ దేవేందర్ సింగ్ చౌహన ప్రదీప్ కుమార్ ను అభినందించి మాట్లాడారు. భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో పాల్గొని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.





# గృహలక్ష్మి దరఖాస్తుల స్వీకరణ తేదీని పొడిగించాలి

**తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు**

మోతె,విశాలభారతి: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 12వ తేదీని తుది గడువుగా నిర్ణయించడం సరికాదని, గడువును నెలరోజులపాటు కొనసాగించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టి పెల్లి సైదులు డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గృహలక్ష్మి పథకం దరఖాస్తుల స్వీకరణ కు నెల రోజులు గడువు పెంచాలని కోరుతూ మోతె తాసిల్దార్ ప్రకాష్ రావు కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, ఆదాయ, భూముల రిజిస్ట్రేషన్ పత్రాలు, సదరం పత్రాలను తప్పనిసరిగా జత చెయ్యాలనే నిబంధనల మూలంగా అర్హులైన పేదలు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు.తాసిల్దార్ కార్యాలయంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పొందాలంటే వారం నుండి పది రోజులు పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోసిపిఎం మండల కార్యదర్శిములుకూరి గోపాల్ రెడ్డి,వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కిన్నెర పోతయ్య, సిఐటియు సీనియర్ నాయకులు గుంట గానియేసు,డివైఎఫ్ఐ మండల అధ్యక్షులువెలుగు మధు చేగువేరాతదితరులు పాల్గొన్నారు.



# ఏఎస్పి నీ మర్యాదపూర్వకంగా కలిసిన యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్

**సూర్యాపేట,విశాల భారతి:** హుజూర్నగర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కందుల వినయ్ బుధవారం సూర్యాపేట జిల్లా అడిషనల్ ఎస్పీ మేక నాగేశ్వరరావు ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు కందుల వెంకటేశ్వర్లు, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రదాన కార్యదర్శి.రవ్వ సంజు పవన్, తదితరులు పాల్గొన్నారు.



# గృహలక్ష్మి గడువు పెంచాలి

**బెల్లంకొండ సత్యనారాయణ సిపిఎం మండల కార్యదర్శి**

**నడిగూడెం,విశాలభారతి:**మండలంలోని వేఋగోపాలపురం గ్రామ సీపీఎం పార్టీ జనరల్ బాడీ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ మాట్లాడుతూ గృహలక్ష్మి గడువు ఈనెల 30వ తారీకు వరకు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కనీసం నెలరోజుల గడువు లేకుండా లబ్ధిదారులు ఎలా అప్లై చేసుకుంటారని ఆయన ఆవేదన వెలిబుచ్చారు.కొత్తగా అర్హులైన వారికి ఆసరా, వితంతు, వృద్ధాప్య, పింఛన్లు, రేషన్ కార్డు, ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశనికి రేఖ తిరపయ్య అధ్యక్షన సమావేశం జరగగా కిన్నెర యంకన్న, పిచ్చయ్య, కందుల సంజీవరావు, శ్రీకాంత్, వెంకన్న, వీరస్వామి, సైదులు, శ్రీను, వెంకయ్య,నరసయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# డబల్ బెడ్ రూమ్ వద్ద నిరుపేదలు నిరాహార దీక్ష





- అద్దిల్లులో ఉండలేం అర్జీలు పెట్టుకున్న కదలని అధికారులు
- అందని ద్రాక్షాగా మారిన డబల్ బెడ్ రూమ్ ఇల్లు.

**భద్రాచలం,విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇల్లు భద్రాచలంలో నిరుపయోగంగా ఉన్నాయని ఇల్లు లేని నిరుపేదలు ఆవేదన చెందారు. అధికారులకు ఎన్నిసార్లు అర్జీలు పెట్టుకున్న నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరిస్తున్నారని అందుకనే ఈ నిరాహార దీక్ష చేస్తున్నామని నిరాహార దీక్షలో కూర్చున్న ఇల్లు లేని నిరుపేదలు వారి గోడును వెల్లబోశారు. సుమారు 30 సంవత్సరాలకు పైచిలుకు భద్రాచలం వివిధ కాలనీలలో అద్దెలకి ఉంటున్నామని కూలి పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటూ తల దాసుకుంటున్న మాకు డబల్ బెడ్ రూమ్ ఇమ్మని ఎమ్మార్వో నీ ఎన్నిసార్లు అడిగినా ఇస్తాం ఇస్తాం అంటున్నారు తప్ప ఇప్పటిదాకా ఇవ్వలేదని ఎన్నిసార్లు ఎమ్మార్వో కార్యాలయం చుట్టూ తిరిగిన స్పందించట్లేదని అందుకనే మేము డబల్ బెడ్ రూమ్ దగ్గర నిరాహారదీక్ష కూర్చున్నామని వారు తెలిపారు. పెరిగిన ధరలకు రెక్కలు ముక్కలు చేసి కూలి చేసిన సరిపోవటలేదని కరెంట్ బిల్లులు కుటుంబ పోషణ భారంగా మారుతుందని భద్రాచలంలో ఏ కాలనీలోనైన మాలాంటి నిరుపేదలు ఇంటి అద్దెలు కట్టే పరిస్థితి లేదని ఆవేదన చెందారు. కొంతమంది దళారులు అధికారులతో కుమ్మక్కై నిరుపేదలమైన మా సొంత ఇంటి కల సిదిమేస్తున్నారని డబ్బున్న వాళ్లకి లక్ష రూపాయలు తీసుకొని డబల్ బెడ్ రూమ్ ఇళ్లను ఇప్పిస్తామని ఆశ చూపిస్తున్నారని దాని వలన మాలాంటి అర్హులకు అందకుండా చేస్తున్నారని అందుకనే రెండు రోజులుగా మనుబోతుల చెరువు దగ్గర ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద నిరసన టెంట్ వేసుకొని వంట వార్పు చేసుకుని రాత్రి కూడా దోమలను పురుగు పుట్రను కూడా లెక్కచేయకుండా ఇప్పటిదాకా ఉన్నామని ఎన్ని రోజులైనా మాకు న్యాయం చేసేదాకా ఇక్కడే ఉంటామని ఆశతో అర్హులైన డబల్ బెడ్ రూమ్ కోసం నిరుపేద కుటుంబాలు అధికారులు కదిలొచ్చేదాకా మా నిరసన ఉద్యమం కొనసాగిస్తామని తెలిపారు. భారతదేశ స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాలు కడుస్తున్న పేదల సొంతింటి కల ఏ ప్రభుత్వం నెరవేర్చ లేక పోతుందని వాళ్ల బాధను వ్యక్తపరిచారు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ అయినా మా సొంత ఇంటి కలను నెరవేర్చి నిరుపేదలైన మాకు డబల్ బెడ్ రూమ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాకు డబల్ బెడ్ రూమ్ ఇచ్చేదాకా ఈ నిరసన ఉద్యమం కొనసాగుతుందని విశాల భారతి రిపోర్టర్ కి వారు స్పష్టం చేశారు. వాళ్ల బాధను వ్యక్తపరిచిన వారిలో అలవాల రాజా పెరియర్ బొడ్డు సత్యనారాయణ మేకలత ఇల్లందుల హేమలత తెల్ల సమ్మక్క భానోత్ పార్వతి కుమారి కృష్ణవేణి నీలాల ఎస్ కే రహిమ నిర్మలమ్మ రాణి సుహాసిని. తదితరులు. విశాల భారతి రిపోర్టర్ కి వాళ్ల గోడును వినిపించారు.



## 30 పడకల ఆసుపత్రిని 100 పడకలుగా ఆధునీకరణ

**కోదాడ,విశాలభారతి:** కోదాడ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని 30 పడకల ఆసుపత్రిని 100 పడకలుగా జీవో నెంబర్ ఆర్ టి 442 ద్వారా బుధవారం తెలంగాణ ప్రభుత్వం కోదాడ ప్రభుత్వ ఆసుపత్రిని 30 పడకల నుంచి 100 పడకలుగా మార్చడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంద పడకలుగా ఆధునీకరణ కొరకు 26 కోట్లు విడుదల చేయడం అందుకు కృషి చేసిన స్థానిక శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్, మంత్రివర్యులు జగదీశ్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



# ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య**

**రామన్నపేట,విశాలభారతి:**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని నకరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. బుధవారం రామన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన 108, 102 వాహనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రామన్నపేట ఆస్పత్రి అభివృద్ధి కోసం 8 కోట్ల రూపాయలు మంజూరు కానున్నాయని అన్నారు.కేసిఆర్ ప్రభుత్వం గర్భిణీ స్త్రీలకు ఉచితంగా 104 ద్వారా సేవలు అందిస్తూ పుట్టిన బిడ్డకు కేసిఆర్ కిట్టు అందజేస్తుందన్నారు. అత్యవసర అత్యవసర సమయంలో ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం నూతనంగా అన్ని సదుపాలతో అంబులెన్స్లను ఏర్పాటు చేసిందన్నారు. ఈ అవకాశాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కన్నెబోయిన జ్యోతి బలరాం, ఆస్పత్రి సూపరెంట్ డాక్టర్ బి వీరన్న, మునిపంపుల వైద్యాధికారి డాక్టర్ అశ్విన్ కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మందడి ఉదయ రెడ్డి, మండల కార్యదర్శి పోషకపోయిన మల్లేశం, ఎంపీటీసీ గొరిగే నరసింహ, సర్పంచులు గుత్తా నర్సిరెడ్డి మెట్టు మహేందర్ రెడ్డి నాయకులు బందెల రాములు అన్నారు బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పోతరాజు సాయికుమార్, బద్దుల రమేష్ యాదవ్, జాడ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



# శేరిలింగంపల్లిలో ప్రజా రవాణా వ్యవస్థ అధ్వానం

- వర్షం పడితే రాక పోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న కాలనీ వాసులు
- నార్నే ఎస్టేట్స్ నుండి పాపిరెడ్డి కాలనీ లింక్ రోడ్ త్వరితగతిన పూర్తి చేయాలి
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్

**శేరిలింగంపల్లివిశాలభారతి:** శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి కాలనీ, హుడా కాలనీలో వర్షం పడినప్పుడల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికుల విజ్ఞప్తి మేరకు బీజేపీ శ్రేణులు, స్థానిక కాలనీ వాసులతో కలిసి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ బుధవారం సమస్యలపై పర్యటించారు. వర్షం కురిసిన ప్రతిసారీ రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా ఉందని,లింక్ రోడ్ పూర్తి చేస్తే ఎంతో మేలు చేకూరుతుందని రవికుమార్ యాదవ్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత అధికారులతో మాట్లాడి పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. వర్షం పడిన ప్రతిసారీ పాపిరెడ్డి కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, నార్నే ఎస్టేట్స్ నుండి వచ్చే లింక్ ను త్వరితగతిన పూర్తి చేసినట్లైతే కాలనీ వాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.సంబంధిత అధికారులతో మాట్లాడి లింక్ రోడ్ పూర్తి చేయిస్తానన్నారు. ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు ప్రజల కోసం పనిచేయాలనీ హితవు పలికారు,గత పది సంవత్సరాల క్రితం మాజీ శాసనసభ సభ్యులు బిక్షపతి యాదవ్ నిర్మించిన రోడ్లు, అభివృద్ధి పనులను తప్ప బిఆర్ఎస్ పార్టీ నాయకులు చేసిందేమీ లేదన్నారు.ఈ కార్యక్రమంలో ఎల్లేష్,రమేష్, శ్రీనివాస్,రమణ, నర్సింగ్ యాదవ్,కోటి,సత్య కుమార్, శ్రీనివాస్ యాదవ్,శ్రీకాంత్, విజయలక్ష్మి,సుశీల,లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా యువజన కాంగ్రెస్ 63వ ఆవిర్భావ దినోత్సవం

- కాంగ్రెస్ నాయకులు సౌందర్య రాజన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం
- హాజరైన యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేన రెడ్డి

**శేరిలింగంపల్లివిశాలభారతి:** యువజన కాంగ్రెస్ 63వ ఆవిర్భావ దినోత్సవాన్ని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు ఘనంగా నిర్వహించారు. యువజన కాంగ్రెస్ నాయకులు సౌందర్ రాజన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేన రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పాలకూరి రవికాంత్ గౌడ్ లు హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు నియోజకవర్గ పరిధిలో విస్తృతంగా పర్యటించి ఇంటింటికి వెళ్ళి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని కోరారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేసిన యువజన కాంగ్రెస్ నాయకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహిపాల్ యాదవ్, విఎస్ఎన్ చౌదరి, రఘునాథరెడ్డి,రఘునాథ్ యాదవ్,కాటా నరసింహ గౌడ్, హరికృష్ణ,ప్రభాకర్,గోపి,శివ రాథోడ్,హర్షవర్ధన్,అలీ,జావిద్, హుస్సేన్,వహీదా బేగం, చిరుమర్తి రాజు,జహంగీర్, సాయి కిషోర్, సూర్య రాథోడ్, శామ్యూల్ కార్తీక్,మందుల సైదులు,తదితరులు పాల్గొన్నారు.



# పర్యావరణ పరిరక్షణకై నిత్యకృషి చేస్తున్న గ్రీన్ భద్రాద్రి అభినందనలు తెలిపిన ఐ టి డి ఎ పి ఓ ప్రతీక్ జైన్

**భద్రాచలం,విశాలభారతి:** ఆగస్టు 9 న గ్రీన్ భద్రాద్రి వారి ఆధ్వర్యంలో స్థానిక గ్యాస్ గూడౌన్ పక్కన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించటానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఐ.టి.డి.ఏ. పి.ఓ. ప్రతీక్ జైన్ ఐ.ఏ.యస్. మాట్లాడుతూ గత 11 సంవత్సరాల నుండి నిరంతరంగా మొక్కలు నాటుతూ , వాటి సంరక్షణ బాధ్యతగా భావించి పర్యావరణ పరిరక్షణకు నిత్యం కృషిచేస్తున్న గ్రీన్ భద్రాద్రి వారు అభినందనీయులని, వారికి మా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని తెలియజేసారు.ఈ కార్యక్రమంలో గ్రీన్ భద్రాద్రి అధ్యక్షులు బెల్లంకొండ రాంబాబు, ప్రధాన కార్యదర్శి శ్రీరంగం సంపత్, కోశాధికారి విష్ణుమొలకల సుబ్రహ్మణ్యం, గౌరవాధ్యక్షులు పల్లింటి దేశప్ప , భోణాల నాగ సూర్య నారాయణ , కామిశెట్టి కృష్ణార్జున రావు , ఉపాధ్యక్షులు ఏ. ఉమా శంకర్ నాయుడు, పూసం రవికుమారి, పి.ఆర.ఓ. ఎల్. వెంకటేశ్వర్లు , పచ్చినీలం మునికేశవ్ , ఆర్. రామకృష్ణా రెడ్డి, గంగాధర వీరయ్య, తంగేటి కృష్ణ, బండారు తిలక్, యర్లగడ్డ సాంబశివరావు, కాపల్లి ప్రసాద్,భూషణరావు , రాణి మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# తాటి చెట్టు పై నుండి పడి గీత కార్మికుని మృతి



**వలిగొండ,విశాలభారతి:** తాటి చెట్టు పైనుండి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని పొద్దుటూరు గ్రామంలో చోటుచేసుకుంది. మృతుని భార్య తెలిపిన వివరాల ప్రకారం వలిగొండ మండలంలోని పొద్దుటూరు గ్రామానికి చెందిన బత్తుల శ్రీనివాస్ గౌడ్ (48) వృత్తిరీత్యా కల్లు గీత కార్మికుడు. రోజు మాదిరిగానే గీత వృత్తిలో భాగంగా కల్లు తీయుటకు ఉదయం 6 గంటలకు ఇంటి నుండి వెళ్లాడు. 9 గంటల వరకు ఇంటికి రాకపోయేసరికి భర్త మొబైల్ కు ఫోన్ చేయగా రింగ్ అవుతుంది కానీ లిఫ్ట్ చేయట్లేదు. దీంతో అనుమానంతో తన మేనల్లుడు అయిన శివకు ఫోన్ చేసి విషయం తెలుపగా కొంగరబోయిన బుచ్చయ్య బావిదగ్గరకు వెళ్లి చూడగా శ్రీనివాస్ తాడిచెట్టు కింద పడి ఉండడంతో హుటాహుటిన భువనగిరిలోని ఏరియా హాస్పిటల్ కి తరలించగా అక్కడ డ్యూటీ డాక్టర్ పరిశీలించి చనిపోయాడు అని నిర్ధారించారు. అతని భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై పెండ్యాల ప్రభాకర్ పంచనామ నిర్వహించి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# ట్రాక్టర్ కిందపడి వ్యక్తి మృతి

**నడిగూడెం,విశాలభారతి:** ప్రమాదవశాత్తు టాక్టర్ కిందపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలం పరిధిలోని వల్లాపురం గ్రామాల్లో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పల్లా రవీందర్ రెడ్డి ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం రాజుపేట గ్రామ రెవిన్యూ పరిధిలోని తన సొంత వ్యవసాయ భూమిని దున్నుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పల్టీ కొట్టడంతో రవీందర్ రెడ్డి ట్రాక్టర్ కిందపడి అక్కడికి అక్కడే మృతి చెందాడు మృతుడికి భార్య ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. గ్రామానికి చెందిన వ్యక్తి అకాల మరణం పట్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



# ఘనంగా కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ జన్మదిన వేడుకలు

- జెసీబీ తో భారీ ఎత్తున గజమాల వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన అభిమానులు
- భారీ కేక్ ను కట్ చేసిన కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్



**శేరిలింగంపల్లి,విశాలభారతి:** శేరిలింగంపల్లి డివిజన్ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ జన్మదిన వేడుకలు బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. శేరిలింగంపల్లి డివిజన్ హుడా ట్రేడ్ సెంటర్ లోని రామాలయంలో జన్మదిన సందర్భంగా వేద పండితులచే ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి ఆశీస్సులు అందుకున్నారు.అనంతరం శేరిలింగంపలల్లి కార్పొరేటర్ వార్డు కార్యాలయ ఆవరణలో టీం ఆర్ఎన్ వై ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు హాజరై రక్తదానం చేశారు.బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, మహిళా నాయకులు అభిమానుల సమక్షంలో వార్డు కార్యాలయం వద్ద జేసీబీతో భారీ గజమాల వేసి ఆవరణలో అలంకరించిన సభ ప్రాంగణం వరకు భారీ ఎత్తున ర్యాలీగా తరలివచ్చి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.బర్త్డే సందర్భంగా నేతలు హంగామా చేశారు.డిజె సౌండ్స్,బ్యాండ్ మేళాల నడుమ రోడ్లపై డ్యాన్సులు చేసి తమ అభిమాన నాయకుడి బర్త్డే సందర్భంగా ప్రధాన కూడళ్లలో భారీ ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. అప్పటికే భారీ ఎత్తున ఏర్పాటుచేసిన బర్త్డే కేక్ ను కార్పొరేటర్ కట్ చేశారు.కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, స్టేట్ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్పర్సన్ రాగం సుజాత యాదవ్ సొంత ఖర్చుతో నిర్మించిన ఎంపీపీఎస్ సురభి కాలనీ పాఠశాల విద్యార్థి,విద్యార్థినిలు విచ్చేసి గులాబీ మొక్కలను కార్పొరేటర్ కు ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యులు అరేకపూడి గాంధీ,డివిజన్ల కార్పొరేటర్లు, స్థానిక నాయకులు, ప్రముఖులు,శేరిలింగంపల్లి నియజకవర్గం నలుమూలల నుండి విచ్చేసి కార్పొరేటర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.తన జన్మదిన పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా ఆయన ధన్యవాదాలు తెలిపారు.



# గోదాంను ప్రారంభించిన ఛైర్మెన్

**ఆర్మూర్,విశాలభారతి:**బుదవారం నాడు దేగాంలో ప్రాథమిక వ్యవసాయం సహకార సంఘం ఆలూరు బ్రాంచ్ దేగాం లో గోదాం ను చైర్మన్ కళ్లెం భోజరెడ్డి చేతుల మీదుగా ప్రారంబించారు, ఈసందర్భంగా ఛైర్మెన్ మాట్లాడుతూ రైతుల కు ఈ బ్బందుల వలన కొత్తది నిర్మించమని అన్నారు ఇట్టి కార్యక్రమనికి వైస్ చైర్మన్ చేపూర్ రాజేశ్వర్, సర్పంచ్ గడ్డం సరోజ గంగారెడ్డి, ఎంపీటీసీ ఉప్పు అనూష శ్రీనివాస్ గౌడ్ డైరెక్టర్ ల్లు అరె రాజేశ్వర్, దూదిగాం ప్రమోద్, కల్లెం సాయరెడ్డి, ఇంగు గోవర్ధన్, బార్ల సంతోష్ రెడ్డి, తంబుర్ శ్రీనివాస్, వెల్మ నర్సరెడ్డి, పచ్చుక నాగన్న,బి ఆర్ ఎస్ నాయకులు ఇట్టేడి లింగా రెడ్డి, రాజ మల్ల రెడ్డి, గ్రామ కమిటీ సభ్యులు సంఘం సెక్రెటరీ తొర్తి మల్లేష్ సిబ్బంది డి. ముత్యం, దేవరాజు, గంగారాం, రాజు రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# బస్తీలను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

**కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్**

**శేరిలింగంపల్లివిశాలభారతి:** మాదాపూర్ డివిజన్ పరిధిలోని ప్రతి బస్తీ,కాలనీలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని శిల్పాపార్క్ కాలనీలో స్థానిక నాయకులతో కలిసి సమస్యలపై పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్తీ,కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.మురుగునీటిని తొలగించి పరిసరాలు శుభ్రంగా ఉంచడమే లక్ష్యంగా ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఆదర్శవంతమైన కాలనీలుగా సుందరంగా సమిష్టి కృషితో అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని,మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో నవీన్ గుప్తా, శ్రీనివాస్,సాయి,చంద్రశేఖర్, ప్రసాద్ స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

# సిట్టింగు ఎమ్మెల్యేలకే టికెట్లు..

- ఇందూరు వేదికగా కుండబద్దలు కొట్టిన మంత్రి కేటీఆర్.
- ఊపిరి పీల్చుకున్న సిట్టింగులు...
- నిజామాబాద్‌లో మళ్లీ ఆ ఐదుగురికే టికెట్లు..
- కడుపులో పెట్టి కాపాడుకోండి... కేటీఆర్.
- ఎంపీ అర్వింద్‌పై మంత్రి కేటీఆర్ ఘాటు విమర్శలు..
- నువ్వెక్కడ పోటీ చేసినా నీ డిపాటిట్ గల్లంతు చేస్తం...
- అర్వింద్‌పై సంచలన వ్యాఖ్యలు చేసిన కేటీఆర్..



**నిజామాబాద్,విశాలభారతి:** ప్రజా వ్యతిరేకత కూడగట్టుకున్న చోట సిట్టింగులకు చెక్‌పెడతారనే ఊహాగానాలకు ఇందూరులో క్లారిటీ ఇచ్చాడు మంత్రి కేటీఆర్. ఇందూరలోని ఐదు నియోజకవర్గల్లో కూడా సిట్టింగులే పోటీలో ఉంటారని ఆయన బహిరంగ సభ వేదికగా ప్రకటించేశాడు. ఐటీ హబ్ ప్రారంభానికి వచ్చిన కేటీఆర్.. పాలిటెక్నిక్ మైదానంలో జరిగిన బహిరంగ సభలో ఈ విషయాన్ని ధ్రువీకరించాడు. మామూలుగా ఏదైనా మీటింగులో లోకల్ ఎమ్మెల్యేను గెలిపించడంటూ ఆ ఎమ్మెల్యేకు సీటు గ్యారెంటీ అని క్లారిటీ ఇచ్చే కేటీఆర్.. ఇందూరులో మాత్రం ఒకడుగు ముందుకేశాడు. ఇందూరులోని ఐదు నియోజ కవర్గాల్లో అందరి సిట్టింగులకే టికెట్లు అని ప్రకటించేశాడు. నిజామాబాద్ అర్బన్ నుంచి బిగాల గణేశ్ గుప్తాను 55వేల మెజారిటీతో గెలిపించాలని కోరిన ఆయన.. మిగలిన సిట్టింగు ఎమ్మెల్యేలు, మంత్రి ప్రశాంత్‌రెడ్డితో సహా... మంచిగా, నిజాయితీగా పనిచేస్తున్నారని, వీరిని కడుపులో పెట్టుకుని కాపాడుకోవాలని ఆయన కోరారు. దీంతో సిట్టింగులెవరికీ ఇందూరులో చెక్ పడబోదని మంత్రి కేటీఆర్ బహిరంగ సభా వేదిక సాక్షిగా కుండబద్దలు కొట్టారు. దీంతో సిట్టింగులు ఊపిరి పీల్చుకున్నారు. ఎంపీ అర్వింద్‌పై మంత్రి కేటీఆర్ ఘాటు విమర్శలు. నువ్వెక్కడ పోటీ చేసినా నీ డిపాటిట్ గల్లంతు చేస్తం. నిజామాబాద్ ఎంపీ అర్వింద్ పై మంత్రి కేటీఆర్ తీవ్ర స్థాయిలో ఫైర్ అయ్యారు. ఎంపీగా అర్వింద్ గెలవడాన్ని అడ్డిమారి గుడ్డిదెబ్బ కింద జమ కట్టారు. అనుకోకుండా అలా గెలిచేశాడని, అతనో నిరక్షరాస్యుడని, కుసంస్కారి అని ఘాటుగా తిట్ల దండకం అందుకున్నాడు. నాన్న వయస్సున్న కేసీఆర్‌ను నోటికొచ్చినట్టు తిడుతున్నాడని, అతని తండ్రి డీఎస్‌ను మేం అనలేమా..? కానీ మాకు సంస్కారం తెలుసు అంటూ ఎంపీ అర్వింద్‌కు చురకలంటించాడు కేటీఆర్. నువ్వు ఎక్కడి నుంచి పోటీ చేసినా నీకు డిపాజిట్ కూడా దక్కదు.. ప్రజలకు తెలిసిపోయింది నీ గురించి అని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. చావు నోట్లో తలపెట్టి తెలంగాణ సాధించి, ప్రజల దీవెనలతో రెండు సార్లు సీఎం అయిన డెబ్బైఏళ్ల వయస్సున్న కేసీఆర్‌పై నీ నోటికొచ్చినట్టు మాట్లాడతవా..? అంటూ ఫైర్ అయ్యాడాయన. హిందూ, ముస్లింల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టడమే తప్ప మీరు చేసిన అభివృద్ధి ఏం ఉంది.? అని ప్రశ్నించారు. నయా పైసా అభివృద్ధి నిజామాబాద్‌కు చేయలేదు కాబట్టే నీకు ముఖం లేక ఈ మీటింగుకు రాలేదని ఎద్దేవా చేశాడు.



## మహేష్ కృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా మహేష్ బాబు జన్మదిన వేడుకలు

**యాదాద్రి భువనగిరి, విశాలభారతి:** యాదాద్రి భువనగిరి జిల్లా మహేష్ కృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో మహేష్ బాబు 49వ జన్మదిన వేడుకలు రాష్ట్ర కోఆర్డినేటర్ పిట్టల బాలరాజ్, జిల్లా అధ్యక్షులు నాగేల్లి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో వసుంధర థియేటర్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేసి, కేక్ కట్ చేసి, టపాకాయలు కాల్చి సంబరాలు చేసుకున్నారు. పుట్టినరోజు సందర్భంగా స్పెషల్ షో బిజినెస్ మేన్ మూవీ వసుంధర థియేటర్లో వేయించడం జరిగింది. మహేష్ బాబు సినిమాల్లో నటించుకుంటూ పేద పిల్లలకు గుండె ఆపరేషన్లు చేయిస్తూ ఎంతోమంది పిల్లల్ని కాపాడుతున్నారని, ఆంధ్రాలో ఒక గ్రామాన్ని తెలంగాణలో ఒక గ్రామాన్ని దత్తత తీసుకొని ఆ గ్రామ అభివృద్ధికి పాటుపడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి పట్టణ అధ్యక్షులు రమేష్‌కోటి, సురుపంగ చందు, నాగేల్లి విగ్నేష్ రెడ్డి, విజయ్, రామకృష్ణంరాజు, ఎండి. జానీ, వల్లపు అశోక్, జితేష్, అక్షయ్, నితీష్, ఆదిత్య, నరేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



## గృహలక్ష్మి పథకం దరఖాస్తు గడువు పెంచాలి

**మున్సిపల్ ఆఫీస్ వద్ద కాంగ్రెస్ పార్టీ ధర్నా**

**భువనగిరి టౌన్ ,విశాలభారతి:** గృహలక్ష్మి దరఖాస్తు గడువు తేదీని పొడిగించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మరియు కాంగ్రెస్ పార్టీ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ పోతనక్ ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో మునిసిపల్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం మునిసిపల్ కమీషనర్ నాగిరెడ్డి కి మెమోరాండం ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో బి ఎస్ పి రాష్ట్ర నాయకులు బట్టు రామచంద్రయ్యా మాజీ మునిసిపల్ చైర్మన్ బట్టె జహంగీర్ కౌన్సిలర్ లు ఈరపాక నర్సింహా కోళ్ల గంగాధర్ కైరంకోండ సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీ ఎస్ సి సెల్ జిల్లా అధ్యక్షులు దర్గాయి హరిప్రసాద్ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎండి బబ్లు జిల్లా ఉపాధ్యక్షులు పిన్నింటి స్టాన్లీ మాజీ కౌన్సిలర్ దేవరకొండ నర్సింహా చారి సీనియర్ కాంగ్రెస్ పార్టీ లీడర్లు షరీఫ్ దర్గాయి దేవేందర్ గ్యాస్ చిన్న డాకూరి ప్రకాష్ ప్రవీణ్ శీను సేటు తదితరులు పాల్గొన్నారు.

## గృహలక్ష్మి పథకం దరఖాస్తు గడువు పొడిగించాలి

- నిజమైన లబ్ధిదారులకే అవకాశం కల్పించాలి
- బిఎస్పి నకిరేకల్ నియోజకవర్గ ఇంచార్జి మేడి ప్రియదర్శిని



**నకిరేకల్,విశాలభారతి:** గృహలక్ష్మి పథకం కోసం దరఖాస్తు సమయాన్ని ఒక నెల రోజులకు పొడిగించాలని బిఎస్పి నకిరేకల్ నియోజకవర్గ ఇంచార్జి మేడి ప్రియదర్శిని కోరారు. గృహలక్ష్మి దరఖాస్తుకు అవసరమైన కులము, ఆదాయము, నివాస ధ్రువీకరణ పత్రం ఎమ్మార్వో ఆఫీస్ నుంచి తొందరగా తీసుకునే అవకాశం లేదు. మీ మీ సేవలో సర్వర్ ప్రాబ్లం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ఇచ్చిన నాలుగు రోజుల గడువు సమయం సరిపోదని వాళ్ళు ఎప్పుడు దరఖాస్తు చేసుకుంటారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బీసీ బందు మైనార్టీ బంద్ దరఖాస్తు సమయంలో కూడా తక్కువ సమయం ఇచ్చినందున చాలామంది దరఖాస్తు చేసుకోలేకపోయి ప్రభుత్వ పథకాలు అందుకోలేక పోయారు. ప్రభుత్వం ఆదాయం కోసం ప్రారంభించిన వైన్స్ దరఖాస్తులకు 15 రోజులు గడువు ఇచ్చి పేద వాళ్ల చిరకాల కోరిక అయిన గృహనిర్మానానికి నాలుగు రోజుల గడువు ఇవ్వడం శోచనీయమని అన్నారు. పేదవారికి ఎలాంటి షరతులు లేకుండా సొంత ఇంటి స్థలం ఉండి ఇల్లు కట్టుకోవడానికి సిద్ధంగా ఉన్న వాళ్ళందరికీ అవకాశం కల్పించాలని కోరారు బి ఆర్ ఎస్ పార్టీ కార్యకర్తలకు కాకుండా నిజమైన అర్హత కలిగిన పేదవారికి ప్రభుత్వ పథకాలలో అవకాశం కల్పించాలని కోరారు.



## గృహలక్ష్మీ పథకంకు దరఖాస్తుల హోరు

**జిరాక్స్ దుకాణాదారుల జోరు**

**షాద్ నగర్,విశాలభారతి:** సొంత జాగా ఉండి ఇల్లు నిర్మించుకోవాలనే వారికి రాష్ట్రప్రభుత్వం 'గృహలక్ష్మి' పథకం కింద రూ.3 లక్షల ఆర్థికసాయం అందించనున్నది. ఈ పథకానికి ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేయడంతో దరఖాస్తుల ప్రక్రియ షురూ అయింది.గడువు 3రోజులే ఉండటంతో దరఖాస్తు చేసుకునేందుకు ప్రజలు పోటేత్తారు. ఇదే అదనుగా నియోజకవర్గ పరిధిలోని కేశంపేట మండలకేంద్రంలోని జిరాక్స్ సెంటర్ల వారు అధిక ధరలు వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గృహలక్ష్మీ పథకానికి అప్లై చేసుకోవడానికి వచ్చిన వారితో గృహలక్ష్మీ పథకం ఫారం, కులం, ఆదాయం పత్రాలకు 400 నుంచి 450 వరకు తీసుకుంటున్నారని దరఖాస్తు దారులు ఆరోపిస్తున్నారు.గత్యంతరం లేక జిరాక్స్ సెంటర్ల వాళ్ళు చెప్పినంత చెల్లించి దరఖాస్తు చేసుకోవాల్సి వస్తుందని, సమయం కూడా లేక పోవడంతో వారు చెప్పినంత సమర్పించుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చొరవ తీసుకొని ఈ దోపిడీని అరికట్టాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

## గృహలక్ష్మి పథకం ధరకాస్తు తేది పొడిగించాలి

- షరతులు లేకుండా గృహలక్షి పథకం అమలు చేయాలి.
- ఇంటి స్థలం లేనివారిని గుర్తించి ప్రభుత్వమే స్థలం కొనుగోలు చేసి ఇళ్లను నిర్మించాలి
- కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వేపూరి సుదీర్.



**నడిగూడెం,విశాలభారతి:** గృహలక్ష్మి పథకం ధరకాస్తు తేదిని పొడిగించాలని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వేపూరి సుదీర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పత్రికా విలేకరులతో మాట్లాడుతూ గృహ లక్ష్మీ పథకం కొరకు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆశలు అడియాసలయ్యేలా ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం ఉందని అన్నారు.ఇండ్లు లేని నిరుపేదలు వారి ఆశలు నిరాశగానే మిగిలిపోయే పరిస్థితి కనపడుతుందన్నారు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతుందని గ్రామాలలో గ్రామీణ ప్రాంతాలలో నివసించే నిరుపేదలు మద్యానికి బానిసలై తన.కుటుంబాన్ని పోషించుకోలేని దిక్కుతోచని పరిస్థితులలో జీవిస్తున్నారని అలాంటి మద్యం మహమ్మారిని నిలుపుదల చేయకుండా మద్యం టెండర్ల గడువు 15 రోజులు పెట్టి గృహలక్ష్మి పథకానికి నాలుగు రోజులు గడువు పెట్టడం సరైన నిర్ణయం కాదన్నారు.షరతులతో కూడిన నిబంధనలు పెట్టటంతో గృహలక్ష్మి పథకంపై ప్రభుత్వ చిత్త శుద్ధి తేటతెల్లమైందన్నారు. కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం లు కార్యాలయంలో పొందెందుకే రెండు మూడు రోజులు పడుతుందని గృహలక్ష్మి దరఖాస్తుకు నాలుగు రోజులు గడువు ఎలా సరిపోతుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చాలామంది బ్రతుకుతెరువు కోసం గ్రామాలను వదిలి పట్టణాలకు వలస పోయారని వారు గ్రామాలకు వచ్చి దరఖాస్తులు చేసుకునే అవకాశం కూడా లేకుండా నాలుగు రోజులు గడువు పెట్టటం సమంజసం కాదన్నారు. దరఖాస్తు తేదీని ఈ నెలాఖరు వరకు పొడిగించాలన్నారు. ఎలాంటి షరతులు లేకుండా ఇంటి స్థలం ఉండి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి గృహ లక్ష్మీ పథకం వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

## సూపర్ ఫాస్ట్ రైలును సమయానుసారంగా నడపాలి

- నిలిపివేసిన రైళ్ళను తిరిగి ప్రారంభించాలి
- భాజపా జిల్లా నాయకులు భూక్యా తారప్రసాద్



**మణుగూరు, విశాలభారతి:** మణుగూరు సూపర్ ఫాస్ట్ రైలు సమయానుసారంగా నిర్ణీత సమయాన్ని కచ్చితంగా పాటించాలని, గతంలో రద్దు చేసిన రైళ్ళను పునరుద్ధరించాలని సోషల్ రెస్పాన్సిబిలిటీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ జిల్లా నాయకులు భూక్యా తారాప్రసాద్ డిమాండ్ చేశారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్‌ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మణుగూరు సూపర్ ఫాస్ట్ రైలు సమయానుసారంగా నిర్ణీత సమయాన్ని కచ్చితంగా పాటించాలి, గతంలో రద్దు చేసిన రైలు కాకతీయ ప్యాసింజర్‌ను పునరుద్ధరించాలని ఆయన అన్నారు. మణుగూరు నుండి హైదరాబాద్ వెళ్ళుటకు ఒకటే రైలు ఉండడంతో మణుగూరు వాసులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆ సూపర్ ఫాస్ట్ రైలుకి జనరల్ బోగీలు కూడా చాలా తక్కువ ఉండడంతో సామాన్య ప్రజలు ప్రయాణం చేయాలంటేనే నరకయాతన పడుతున్నారని తెలిపారు. ఈ మధ్యకాలంలో నిర్ణిత సమయాన్ని పాటించకపోవడంతో ప్రయాణికులు, వృద్ధులు ,పేషెంట్లు, ఉద్యోగస్తులు, తల్లి పిల్లలు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు అని తెలిపారు. ఈ నిర్ణీత జాప్యాన్ని రైల్వే అధికారులు జోక్యం చేసుకొని మణుగూరు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నిర్ణీత సమయానికి అనుకూలంగా నడిచే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. మణుగూరు నుండి ఒకే ఒక ట్రైన్ ప్రతిరోజు హైదరాబాదుకు రాకపోకలను నిర్వహిస్తుంది. రాత్రి 10:30 గం.లకు హైదరాబాదు నుండి బయలుదేరి ఉదయం 5 గంటలకు మణుగూరుకు రావలసిన ట్రైన్ నాలుగైదు గంటలు ఆలస్యం అయ్యి సుమారు ఉదయం 8, 9 గంటల మధ్యలో వస్తుందని అన్నారు. దక్షిణ మధ్య రైల్వే విభాగం సికింద్రాబాద్ జోన్ జనరల్ మేనేజర్ అధికారి అరుణ్ కుమార్ జైన్ సత్వరమే ఈ సమస్యకు పరిష్కారం చూపాలని, జాప్యాన్ని నివారించి నిర్ణీత టైంలోనే ట్రైన్ రాకపోకలను సాగించాలని ప్రయాణికుల తరపున తారప్రసాద్ రైల్వే అధికారులను కోరారు.

## జాతి అభ్యున్నతికి ఆదివాసి సంఘాలు ఐక్యంగా పోరాడాలి

**ఆదివాసి దినోత్సవ వేడుకలో పాల్గొన్న ధనసరి సూర్య**



**మణుగూరు,విశాలభారతి:** మణుగూరు మండలం విప్పలసింగారం గ్రామంలో ఆదివాసి సంఘం నాయకుల ఆత్మీయ ఆహ్వానం మేరకు ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకల్లో యువజన కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ధనసరి సూర్య పాల్గొనారు. ఈ సందర్భంగా ఆదివాసిల యుగ పురుషుడు కొమరం భీం చిత్రపటానికి పూలతో నివాళులర్పించి ఆదివాసి జెండాను ఆవిష్కరించారు. ఈ మేరకు యువజన కార్యదర్శి ధనసరి సూర్య మాట్లాడుతూ.. ఐక్యరాజ్య సమితి 1994లో ఆదివాసుల సంరక్షణకు ఆదివాసుల దినాన్ని ప్రకటించిందని పేర్కొన్నారు. ఆదివాసి ప్రజల అభ్యున్నతికి వివిధ ఆదివాసి సంఘాల నాయకులు ఐక్యంగా పోరాడి హక్కులను పరిరక్షించుకోవాలని తెలియజేశారు. ఇప్పుడున్న ప్రభుత్వాలు కొమరం భీమ్ ఇచ్చిన నినాదాన్ని జల్ జంగిల్ జమీన్ దూరం చేస్తూ ఆదివాసుల అభివృద్ధిని పక్కన పెడుతున్నారన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఆదివాసీ నాయకులు ఆధ్వర్యంలో దనసరి సూర్యను శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. చిన్నారులు, మహిళలు, ఆదివాసి నాయకులతో కలిసి ఆదివాసుల సంస్కృతిక నృత్య ప్రదర్శనలో పాల్గొని సందడి చేశారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల ఆదివాసీ నాయకులు పాల్వంచ సుబ్బయ్య, సోడే రామచంద్రు, పాల్వంచ రాములు, జోగా సురేంద్ర ప్రసాద్, సోడే రవికుమార్ దొర, కనితి గోపయ్య, పాల్వంచ నాగేశ్వరరావు, పాల్వంచ సత్యం, జోగ శేషమ్మ, కారం లక్ష్మీ నర్సు, పాల్వంచ శ్రీను, తాటి రాజు, సోడా సమ్మయ్య, చంద మంగమ్మ, పాల్వంచ చంద్రం, పాల్వంచ కృష్ణయ్య, సోడే వెంకటేశ్వర్లు, తాటి లక్ష్మి, పాల్వంచ లక్ష్మి, కుంజ యశోద, సోడే అరుణ, జోగా రాజేశ్వరి, ఏనిక కామరాజు, సనప నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పోనుగోటి చందర్రావు , సాంబశివరావు, మహిళ నాయకురాలు గొంది రాధా, యువజన నాయకులు గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## లింగమ్మ మృతి కుటుంబానికి తీరని లోటు

**పార్థివదేహం పై పుష్పాంజలి ఘటిస్తున్న శశిధర్ రెడ్డి**



నడిగూడెం,విశాలభారతి: గునుగుంట్ల లింగమ్మ మరణం బాధాకరమని కుటుంబానికి తీరని లోటని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కన్మంత్ రెడ్డి శశిధర్ రెడ్డి అన్నారు. బుధవారం నడిగూడెం గ్రామానికి చెందిన మాజీ వార్డ్ సభ్యులు గునుగుంట్ల వెంకన్న తల్లి గునుగుంట్ల లింగమ్మ మరణించడంతో ఆమె పార్థివదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.వారి వెంట చిలుకూరు మండల జడ్పిటిసి బొలిశెట్టి శిరీష నాగేంద్రబాబు నడిగూడెం మండల బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు అనంతుల మహేష్ గౌడ్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కాసాని వెంకన్న గుండు విజయ రామారావు నడిగూడెం గ్రామ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు ఎలక రామ్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు రావూరి బాలాజీ నాయక్ ఉమ్మడి నల్లగొండ జిల్లా యాదవ సంఘం నాయకులు చింతల లింగరాజు యాదవ్ శశిధర్ రెడ్డి యువసేన నాయకులు దున్న ప్రవీణ్ కుమార్ మహమ్మద్ రఫీ ఎస్.కె గౌస్ తదితరులు పాల్గొన్నారు.



## పాలకుర్తి మండలానికి బాడీ ఫ్రీజర్లు

- ఫ్రీజర్లు అందచేసిన లయన్స్ జిల్లా గవర్నర్ వెంకటేశ్వర్ రావు

**పాలకుర్తి,విశాలభారతి:** ఇటీవల లయన్స్ జిల్లా గవర్నర్‌గా ఎన్. వెంకటేశ్వర్ రావు నూతనంగా ప్రమాణ స్వీకారం చేశారు. పాలకుర్తి మండలానికి లయన్స్ క్లబ్ ఆఫ్ పాలకుర్తి, నూతన మహిళ క్లబ్ సేవా భారతి ఆధ్వర్యంలో 50% జిల్లా గవర్నర్, 50% దాతల సహకారంతో నాలుగు బాడీ ఫ్రీజర్లను.. దత్తత గ్రామలైనా దర్దేపల్లి తీగారం విస్నూర్ చెన్నూరు గ్రామాలకు అందచేయాల్సిందిగా తెలియచేశారు. ఈ మేరకు దాతల చేతుల మీదుగా వీటిని అందచేయాలనీ.. లయన్స్ సేవలు ఇంకా విస్తరిస్తామని పేర్కొన్నారు. నాలుగు బాడీ ఫ్రీజర్‌లను సుధా టెక్నో స్కూల్‌లో క్లబ్ బాధ్యులు రీజియన్ చైర్మన్ రాపాక విజయ్, జోన్ చైర్మన్ నంగునూరి రవీందర్‌లకు అందచేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు వీరమనేని సోమేశ్వర్ రావు, ముఖ్య నాయకులు ఎర్రబెల్లి రాఘవ రావు, డాక్టర్ మంద బుచ్చిరెడ్డి, రీజియన్ కార్యదర్శి బజ్జూరి వేణుగోపాల్, సారంగపాణి, చెన్నూరి వెంకటేశ్వర్లు, రాపాక రమేష్, గజ్జి సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలు



**మణుగూరు,విశాలభారతి:** మణుగూరు మండలంలోని సమితి సింగారం గ్రామపంచాయతీ నందు ఎస్టీ సెల్ అధ్యక్షులు కొమరం రామ్మూర్తి ఆధ్వర్యంలో టీపీసీసీ సభ్యులు, పినపాక నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్.చందా సంతోష్ కుమార్ ప్రపంచ ఆదివాసి దినోత్సవ కార్యక్రమాన్ని కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ మేరకు ఆదివాసి ముద్దుబిడ్డ కొమరం భీమ్ చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రపంచ ఆదివాసులందరికీ ఆదివాసీ దినోత్సవ శుభాకాంక్షలు అంటూ తెలియజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదివాసుల అభివృద్ధి, చట్టాల మీద గౌరవం లేదని అన్నారు. అదేవిధంగా మణిపూర్‌లోని ఆదివాసులపై హింసాత్మక ఘటనలు జరుగుతున్నా.. బిజెపి ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటని అన్నారు. బిజెపి ప్రభుత్వానికి ఆదివాసులపై ఉన్న వివక్షను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. అలాగే అనేక గ్రామాల్లో మౌలిక వసతులు లేక ఆదివాసులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. విద్యా, వైద్యం ఇతర మౌలిక వసతులు కల్పించి ఆదివాసుల సంక్షేమం కోసం పెద్ద పీట వేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పినపాక నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం సుధాకర్ రెడ్డి , మణుగూరు మండల అధ్యక్షులు పీరినాకి నవీన్ ,ఆదివాసి నాయకులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా లక్ష్మీ జయరాం రెడ్డి వర్ధంతి

**బొల్లారం మున్సిపాలిటీ, విశాల భారతి:** బొల్లారం బిజెపి అధ్యక్షుడు కొత్వాల్ ఆనంద్ కృష్ణారెడ్డి తల్లిదండ్రులు లక్ష్మీ జయరాం రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని తన కుమార్తె సుదీక్ష రెడ్డి చేతుల మీదుగా సుమారు 500 మందికి చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ ఆనంద కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం

**మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి.**

**బొల్లారం మున్సిపాలిటీ, విశాల భారతి:** మున్సిపాలిటీ పరిధిలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ సంగారెడ్డి అన్నారు. fబుధవారం నాడు బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో 1 వ వార్డ్ కౌన్సిలర్ చంద్రయ్యతో కలిసి దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ మిషన్ ద్వారా నివారణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



## గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోండి

**బొల్లారం మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి**

**బొల్లారం మున్సిపాలిటీ, విశాల భారతి:** బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని నివసిస్తున్న ప్రజలు గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి కోరారు. బుధవారం నాడు తన కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణకు కౌంటర్ ను ఏర్పాటు చేసినట్లు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన చెప్పారు. గురువారం సాయంత్రానికి గడువు ముగుస్తుందని, ప్రతి ఒక్కరూ దీనిని గమనించాలన్నారు. అర్హులైన వారికి తెలంగాణ ప్రభుత్వం మూడు లక్షల రూపాయలు నిర్మాణానికి ఇవ్వనున్నట్లు కమిషనర్ చెప్పారు. ఎన్నో పథకాలకు గడువు సమయాన్ని ఇచ్చి గృహలక్ష్మి పథకానికి రెండు రోజులు మాత్రమే సమయం ఇవ్వడంతో బాధితులు ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజులు గడువు పెంచాలని కోరుతున్నారు. ఈ విషయమై అధికారులు ఉన్నత స్థాయి అధికారులకు సమాచారాన్ని అందించి గడువు సమయాన్ని పొడిగిస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



## హఫీజ్ పెట్ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తా

**- పూజిత గౌడ్**

**శేరిలింగంపల్లివిశాలభారతి:** హఫీజ్ పేట్ డివిజన్ పరిధిలోని సమస్యలు పరిష్కరించేందుకు ఎల్లవేళలా కృషి చేస్తానని కార్పొరేటర్ పూజిత గౌడ్ అన్నారు.బుధవారం డివిజన్ పరిధిలోని యూత్ కాలనీలో స్థానిక నాయకులతో కలిసి నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. అలాగే బస్తీలో నెలకొన్న సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు అనంతరం బస్తీలో నెలకొన్న సమస్యలు,చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై స్థానిక నాయకులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు.ఈ సందర్భంగా పూజిత మాట్లాడుతూ డివిజన్ పరిధిలో మంజూరైన అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చేలా అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సయ్యద్ తాహెర్,ముజీబ్, మహిళ నాయకురాలు పర్వీన్, షమీం,సుల్తానా బేగం తదితరులు పాల్గొన్నారు.



## మహేష్ బాబు రీల్ హీరోనే కాదు..రియల్ హీరో

- **ఘనంగా 'ప్రిన్స్' పుట్టిన రోజు వేడుకలు**
- **సంబరాలు జరుపుకున్న అభిమానులు**
- **సంగీత థియేటర్లో బిజినెస్ మ్యాన్ సినిమా ఫ్రీ రిలీజ్**

పటాన్ చెరువిశాలభారతి

సినీ నటుడు ప్రిన్స్ మహేష్ బాబు జన్మదిన వేడుకలను బుధవారం అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం పట్టణంలోని సంగీత దియేటర్లో హీరో నటుడు ప్రిన్స్ మహేష్‌బాబు పుట్టినరోజు సందర్భంగా బిజినెస్ మ్యాన్ సినిమాను ఫ్రీ రిలీజ్ చేశారు. మహేష్ బాబు అభిమానులు భారీగా తరలివచ్చి దియేటర్ వద్ద సంబరాలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి మహేష్ బాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పలువురు మాట్లాడుతూ హీరో ప్రిన్స్ మహేష్ బాబు జన్మదిన సందర్భంగా ఘనంగా వేడుకలు నిర్వహించినట్టు చెప్పారు. మహేష్ బాబు రీల్ హీరోనే కాదు ఎంతో మంది నిరుపేద కుటుంబానికి చెందిన చిన్న పిల్లలకు గుండె వైద్యం చేయించిన రియల్ హీరో అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మహేష్ బాబు యూత్ సభ్యులు హరీష్, వివేక్, మహేష్, శ్రీకాంత్, అశోక్, నాని, సూర్య, గణేష్, ప్రశాంత్, మహేష్ బాబు, గణేష్, శివకుమార్ రాజు, క్రాంతి, శ్రీను, సూర్య, సాయి కిరణ్ , అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## గీతంలో కొనసాగుతున్న సైన్స్ అడ్మిషన్లు

**పటాన్‌చెరు విశాలభారతి:** గీతం, హైదరాబాద్ లోని స్కూల్ ఆఫ్ సైన్స్ 202324 విద్యా సంవత్సరానికి గాను బీ.ఆప్టోమెట్రీ, బీఎస్సీ, ఎమ్మెస్సీ కోర్సులలో ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతున్నట్టు బుధవారం వెల్లడించారు. ఎల్.వీ.ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ సౌజన్యంతో నిర్వహిస్తున్న బీ.ఆప్టోమెట్రీ కోర్సు; టీసీఎస్ సహకారంతో నిర్వహిస్తున్న బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ అండ్ కాగ్నిటివ్ సిస్టమ్స్ తో పాటు బీఎస్సీ కెమిస్ట్రీ, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, స్టాటస్టిక్స్; ఎమ్మెస్సీ కెమిస్ట్రీ (అనెలిటికల్ / ఆర్గానిక్), ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ, డేటా సైన్స్ కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలియజేశారు. అర్హతా పరీక్షను 50 శాతం మార్కుల సగటుతో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు గీతం ప్రవేశ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు. ఇతర వివరాల కోసం 08455 221 395 / 342 లను సంప్రదించాలని లేదా hydgss.gitam.eduను సందర్శించాలని సూచించారు.






## కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తాం

- **రఘునాథ్ యాదవ్**
- **ఇందిరమ్మ రాజ్యం పునర్నిర్మాణానికి కదులుతున్న యువ సైన్యం**
- **ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండలో పలు పార్టీల కార్యకర్తలు కాంగ్రెస్ లో చేరిక**

**శేరిలింగంపల్లివిశాలభారతి:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకు ఆదరణ జరుగుతుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు మారబోయిన రఘునాథ్ యాదవ్ యాదవ్ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ,స్థానిక యువజన కాంగ్రెస్ నాయకులు బాల గణేష్,విజయ్ కుమార్ రెడ్డి, బాబిల ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులు,కార్యకర్తలు మహిళలు కాంగ్రెస్ పార్టీలో రఘునాథ్ యాదవ్ సమక్షంలో బుధవారం చేరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రాంత ప్రజల దశాబ్దాల కలను, ఆకాంక్షను నెరవేర్చిన సోనియమ్మ రుణం తీర్చుకునే సమయం ఆసన్నమైందని నాయకులు, కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో నియంతృత్వ పాలన కొనసాగుతుందని కేసీఆర్ ప్రభుత్వం పై నిప్పులు జరిగారు. ఈ నయా నిజంను తరిమి కొట్టాలంటే అది కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యమని రానున్న ఎన్నికల్లో కెసిఆర్ ను ఫామ్ హౌస్ కి పరిమితం చేసే సత్తా కేవలం కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలకు మాత్రమే ఉందన్నారు. అందుకోసం మనమంతా కలిసికట్టుగా పనిచేసే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీనియర్ నాయకులు అరుణ యాదవ్,సూర్య వంశీ,ప్రలిత్, రాములు గౌడ్,కర్ణాకర్ రెడ్డి, వెంకట్ రెడ్డి,కుమార్ సాగర్, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

**పాలకుర్తి, విశాలభారతి:** పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో యువజన కాంగ్రెస్ 63వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం పాలకుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ధరావత్ రాజేష్ నాయక్ యువజన కాంగ్రెస్ జెండా ఎగురవేశారు. ఈ సదర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ మాట్లాడుతూ.. ఒక నాయకునిగా ఎదగాలంటే తొలి మెట్టు యూత్ కాంగ్రెస్ అని.. యూత్ కాంగ్రెస్ నుండి ఎంతో మంది ముఖ్యమంత్రులు అయ్యారని అన్నారు. రాబోయే రోజుల్లో టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేయాలని కోరారు. అలాగే పాలకుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ధరావత్ రాజేష్ నాయక్ మాట్లాడుతూ.. ఒక పార్టీకి అత్యధికంగా యువత ఉన్న అనుబంధ సంఘం యువజన కాంగ్రెస్ అని, అలాగే రాష్ట్రంలో నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా యువత సమస్యలపై నిరంతరం పోరాడుతున్న సంఘం యువజన కాంగ్రెస్ అని తెలిపారు. రాబోయే రోజుల్లో పాలకుర్తి గడ్డ నుండి స్థానికేతరుడైన దయాకర్ రావును ఓటమితో పంపే వరకు యువజన కాంగ్రెస్ కంకణ బద్దులై పనిచేస్తుంది అని అన్నారు. పాలకుర్తి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మాదాసు హరీష్ మాట్లాడుతూ.. దేశంలోనే యువత కాంగ్రెస్ కి వెన్నుముకలాంటిదని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి అన్ని విధాలుగా పోరాటాలు చెయ్యాలని తెలిపారు. పాలకుర్తి గడ్డ మీద ఝాన్సిరెడ్డి నాయకత్వములో కాంగ్రెస్ జెండా ఎగురవేసే వరకు యువజన కాంగ్రెస్ పని చేస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవరుప్పుల మండల అధ్యక్షులు పెద్ది కృష్ణమూర్తి, పెద్ద వంగర, కొడకండ్ల, దేవరుప్పుల మండలాల యూత్ అధ్యక్షులు హరికృష్ణ గౌడ్, యాకేశ్ యాదవ్, ఉప్పల అనిల్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు గోనె మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాము నాయక్, ఎస్సీ సెల్ అధ్యక్షులు గాదెపాక భాస్కర్, ఎస్టీ సెల్ లావుడ్య భాస్కర్, సేవాదళ్ నాయకులు ఆదినారాయణ, బిక్షపతి, హేమాని నాయక్, కమ్మగాని శ్రావణ్, ముస్కు అనిల్, ఉమేష్, ఉపేందర్, బత్తిని అశోక్, సోమా శ్రీకాంత్, సురేష్, రవి, సుధాకర్, గుడేపు శోభన్, దారవత్ సురేష్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

## గృహలక్ష్మి పథకం దరఖాస్తు గడువు పొడిగించాలి

**పాలకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ**



**పాలకుర్తి, విశాల భారతి:** గృహలక్ష్మి పథకం పెట్టి దరఖాస్తుకు మూడే మూడు రోజులు సమయం ఇచ్చి ప్రజల్ని గందరగోళపరిచి గృహలక్ష్మి పథకాన్ని 'గృహహింస పథకం'గా మార్చకండని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జాప్యం కారణంగా గృహలక్ష్మి దరఖాస్తులను ఈ నెల ఆఖరి వరకు పొడిగించాలని కోరారు. మహిళల పేరు మీద పట్టా ఉంటేనే గృహలక్ష్మి పథకం వర్తింపు నిబంధనను తొలగించి పురుషుని పేరు మీద పట్టా ఉన్నా గృహలక్ష్మి పథకం మంజూరు చేయాలని అన్నారు. గృహ లక్ష్మీ పథకం గడువు పొడిగించకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని తెలిపారు. గృహ లక్ష్మీ లబ్ధిదారులను మండల రెవెన్యూ అధికారులే ఎంపిక చేయాలని పేర్కొన్నారు. మూడు లక్షల ఆర్థిక సాయం ఇస్తే ఇల్లు నిర్మాణం కాదు కదా మేస్త్రి, కూలీల ఖర్చులకు కూడా సరిపోవని తెలిపారు. గృహలక్ష్మి పథకం ఆర్థిక సాయాన్ని తక్షణమే ఐదు లక్షల రూపాయలకు పెంచాలని బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## సాయి నగర్ కాలనీలో కార్పొరేటర్ పుష్ప నగేష్ పర్యటన

**పటాన్ చెరువిశాలభారతి:** రామచంద్రపురం డివిజన్ పరిధిలోని శ్రీ సాయినగర్ కాలనీలో బుధవారం బస్తి దర్శనం కార్యక్రమం భాగంగా కార్పొరేటర్ బూరుగడ్డ పుష్ప నగేష్ పర్యటించారు. ఇంటింటికి తిరుగుతూ కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 30 లక్షలతో మంజూరైన సీసీ రోడ్డు పనుల కొరకు స్థల పరిశిలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ త్వరలోనే సిసి రోడ్ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. ప్రజా సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ పుష్ప నగేష్ తెలిపారు. కార్యక్రమం కాలనీ అధ్యక్షులు శంకర్ యాదవ్, మహేందర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, రాజ్ కుమార్, వీరిశెట్టి, సీఎం మల్లేష్, రమేష్, ఉమాశంకర్, నరేష్ పాల్గొన్నారు.



## ఘనంగా కొమ్మిడి ప్రభాకర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు

**అడ్డగూడూరు, విశాలభారతి:** యాదాద్రి భువనగిరి జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం అడ్డగూడూరు మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. అంబేద్కర్ చౌరస్తా వద్ద బాణసంచా కాల్చి, కేక్ కట్ చేసి, జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. కొమ్మిడి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. తన పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసిన బిఆర్ఎస్ పార్టీ నాయకులకు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దర్శనాల అంజయ్య, మాజీ ఎంపిటిసి పూలపల్లి జనార్దన్ రెడ్డి, కూరాకుల రవి, అడ్డగూడూరు మండల పార్టీ పట్టణ అధ్యక్షుడు నాగులపల్లి దేవగిరి, అడ్డగూడూరు సర్పంచ్ బాలెంల త్రివేణి దుర్గయ్య, మండల పార్టీ మాజీ ఉపాధ్యక్షులు బాలెంల సాగర్, మండల యువ నాయకులు, బాలెంల అరవింద్, బాలెంల సురేష్, గూడెపు పరమేష్, పయ్యావుల రమేష్, బాలెంల నరేందర్, బాలెంల పరుశురాములు, పయ్యావుల మత్స్యగిరి,బాలెంల జనార్ధన్, బాలెంల శంకర్, బాలెంల మహేందర్, బాలెంల బాబు, బాలెంల నరేష్, నిర్మల వెంకటేష్, వివిధ గ్రామాల నుంచి వచ్చిన బిఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## పదోన్నతిపై వెళ్తున్న పూజారి సమ్మన్నకు ఘన సన్మానం

**పాలకుర్తి, విశాల భారతి:** పాలకుర్తి మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో పూజారి సమ్మన్న గత కొద్ది సంవత్సరాలుగా కారోబార్‌గా విధులు నిర్వర్తించారు. తన విశిష్ట సేవలు అందించి పదోన్నతిపై జఫర్ గడ్ మండలం ఉప్పుగల్లు గ్రామపంచాయతీ కార్యదర్శిగా వెళ్తున్నందున అతనికి గ్రామపంచాయతీ పాలకవర్గం ఘన సన్మానం చేసి, శుభాకాంక్షలు తెలిపింది. పాలకుర్తి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ వీరమనేని యాకాంత రావు, ఉప సర్పంచ్ తరాల చంద్రబాబు, ఎంపీటీసీ ఎడవెల్లి పురుషోత్తం, కమ్మగాని పుష్పలీల, వార్డ్ సభ్యులు అనుముల అంజిరావు, వీరమనేని హనుమంతరావు, కమ్మగాని రమేష్, కమ్మగాని మహేందర్, మామిళ్ళ లక్ష్మణ్, గాదెపాక ఎల్లయ్య, శివరాత్రి సోమయ్య, కో ఆప్షన్ సభ్యులు సర్వర్ ఖాన్, కార్యదర్శి వెంకటేశ్వర చారి గ్రామ పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గృహలక్ష్మి దరఖాస్తు గడువును ఈనెల ఆఖరి వరకు పొడిగించాలి..

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి గౌడ్**




**దేవరుప్పుల, విశాల భారతి:** దరఖాస్తుకు మూడే మూడు రోజులు సమయం ఇచ్చి ప్రజల్ని గందరగోళపరిచి గృహలక్ష్మి పథకాన్ని 'గృహహింస పథకం'గా మార్చకండని దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జాప్యం కారణంగా గృహలక్ష్మి దరఖాస్తులను ఈ నెల ఆఖరి వరకు పొడిగించాలని కోరారు. మహిళల పేరు మీద పట్టా ఉంటేనే గృహలక్ష్మి పథకం వర్తింపు నిబంధనను తొలగించి పురుషుని పేరు మీద పట్టా ఉన్నా గృహలక్ష్మి పథకం మంజూరు చేయాలని అన్నారు. గృహ లక్ష్మీ పథకం గడువు పొడిగించకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని తెలిపారు. గృహలక్ష్మీ లబ్ధిదారులను మండల రెవెన్యూ అధికారులే ఎంపిక చేయాలని పేర్కొన్నారు. మూడు లక్షల ఆర్థిక సాయం ఇస్తే ఇల్లు నిర్మాణం కాదు కదా మేస్త్రి,కూలీల ఖర్చులకు కూడా సరిపోవని అన్నారు. అందువల్ల గృహలక్ష్మి పథకం ఆర్థిక సాయాన్ని తక్షణమే ఐదు లక్షలకు పెంచాలని బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## గృహలక్ష్మికి బారులు తీరిన జనం

**వలిగొండ,విశాలభారతీ:**భువనగిరి జిల్లా వలిగొండ మండలంలో బుధవారం తాసిల్దార్ ఆఫీస్ లో గృహలక్ష్మికి దరఖాస్తు చేసుకునే వారు గుంపులు గుంపులుగా బారులు తీరడం విశేషం ప్రభుత్వం ఇండ్లు లేని పేద ప్రజలకు గృహలక్ష్మి ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఈనెల 10 వరకే లాస్ట్ తేదీ ఉండడంతో జనం అటు ఇటు పరుగులు తీస్తూ కులం ఆదాయం సర్టిఫికెట్ కోసం అనేక అవస్థలు పడవలసి వస్తుందని అంటున్నారు ప్రభుత్వం తేదీని పెంచాలని. ప్రజలు కోరుతున్నారు.

## దివ్యాంగులకు మెగా జాబ్ మేళా

**మేడిపల్లి,విశాలభారతి:**నిరుద్యోగ యువతీ యువకులు, దివ్యాంగులు ఈనెల 17వ తేదీన గోషామహల్ ఇందిరా ప్రియదర్శిని మహిళా కళాశాల వేదికగా నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని టెరెన్ సంస్థ ప్రతినిది నోముల మధు విలేకరుల సమావేశంలో తెలియజేశారు. ఈ సందర్భంగా నోముల మధు మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులు, దివ్యాంగులు మూడు బయోడేటా కాపీలు, ప్రభుత్వం జారీ చేసిన ఐడి కార్డు, విద్యార్హు వీకరణ పత్రాలను వెంట తీసుకొని జాబ్ మేళాకు హాజరు కావాలని తెలియజేశారు. దివ్యాంగులు ఎవరైనా ఉంటే ప్రభుత్వం జారీ చేసే సదరం సర్టిఫికెట్ తో జాబ్ మేళాకు హాజరై ఉపాధిని చేజిక్కించుకోవాలని తెలియజేశారు. మరిన్ని వివరాలకు 7780567547, 8074819404 నెంబర్లకు సంపాదించాలని సూచించారు.

# అన్న ప్రోగ్రాంలో 'అక్క' లేని వెలితి...

- నిజామాబాద్ కేటీఆర్ టూర్‌లో ఎమ్మెల్సీ కవిత డుమ్మా ..
- సర్వత్రా చర్చనీయాంశం... ఉత్సాహం లేకుండానే ప్రోగ్రాంలు...
- ఏర్పాట్లన్నీ సమీక్షించి... సమన్వయం చేసుకుని..
- చివరకు ప్రోగ్రాంకు రాకపోవడంతో డీలా పడిన అభిమానులు.



**నిజామాబాద్,విశాలభారతి:** నిజామాబాద్ కేటీఆర్ టూర్ నిరుత్సాహంగానే సాగింది. కారణం.. ఎమ్మెల్సీ కవిత రాకపోవడమే. కేటీఆర్ టూర్ షెడ్యూల్ ఖరారైన నాటి ఉంచి ఆమె అన్నీ తానై వ్యవహరించారు. మెగాజాబ్‌మేళా నిర్వహణ దగ్గర నుంచి ఐటీ హబ్ ప్రారంభోత్సవ ముస్తాబు వరకు అన్నీ దగ్గరుండి చూసుకున్నారు. అర్బన్, రూరల్ ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకున్నారు. కేటీఆర్ ప్రోగ్రాంకు భారీ ఏర్పాట్లు, సన్నాహాలు విషయంలో కూడా దగ్గరుండి సూచనలు చేశారు. కానీ చివరకు ఆమె కేటీఆర్ ప్రోగ్రాంకు రాకపోవడంతో నిరుత్సాహపడ్డారు బీఆరెస్ శ్రేణులు. ఆమె కనిపించకపోడంతో ఉదయం నుంచే ఆరా తీశారు. ఆమె రాకపోవడానికి రాజకీయ కారణాలూ వెతికారు.ఎవరికి తోచింది వారు అనుకున్నారు. ఎవరి అభిప్రాయలు వారు షేర్ చేసుకున్నారు. అన్న ప్రోగ్రాంకు అక్క లేక పోవడంతో ఏదో వెలితిని సూచించింది. నిరుత్సాహంగానే కార్యక్రమాలు జరిగాయి. పెండింగ్‌లో పడుతూ పడుతూ వచ్చిన ఈ ప్రారంభోత్సవాలకు మంచి ఊపు తీసుకొచ్చేలా కవిత చేసినా.. ఆమే ప్రారంభోత్సవాల్లో లేకపోవడం రాజకీయంగా చర్చకు తావిచ్చింది. ఇది బీఆరెస్‌లోనే కాదు ఇతర పార్టీల్లో కూడా చర్చకు వచ్చింది. జ్వరం వల్ల రాలేదని కొందరు, సీఎం క్యాంపు కార్యాలయంలో పని ఉండి రాలేకపోయారని మరికొందరు ఏవో కారణాలు చెప్పినా.. ఆమె రాకపోవడానికి బలమైన కారణమే ఉందనే అభిప్రాయం మాత్రం సర్వత్రా వ్యక్తమయ్యింది. ప్రతీనెల జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్టు ఆమె ప్రెస్‌మీట్ పెట్టి మరీ చెప్పడంతో ఇందూరు యువతలో కొత్త ఉత్సాహం వచ్చింది.ఆమె చొరవతో కొత్త కంపెనీలు, పేరు మోసిన బడా కంపెనీలు ఇందూరు యువతకు జాబ్‌లు ఇచ్చేందుకు వస్తున్నాయనే ఆశాభావం పెరిగింది. ఈ నెల 29న భూమారెడ్డి కన్వెన్షన్ హాల్ మళ్లీ మెగాజాబ్ మేళా నిర్వహిస్తు న్నామని చెప్పిన కవిత.. ఇక ప్రతీనెల జాబ్‌మేళాలుంటాయని ఇందూరు యువతకు తీపి కబురు చెప్పారు. చివరకు ప్రాధాన్యత కలిగిన కేటీఆర్ ప్రోగ్రాంకు ఆమె లేపోవడం పెద్ద వెలితిగా భావిస్తుండగా.. ఇందులో రాజకీయాలూ ముడిపడి ఉన్నాయనే కోణంలో కూడా చర్చించుకోవడం గమనార్హం.

# పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

- సర్నేని గూడెం గ్రామంలో రూ.40 లక్షలు
- సిరిపురం గ్రామంలో రూ.75 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులు
- అత్యధికంగా పెన్షన్ ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ
- ప్రతీ గడపకు సంక్షేమన్ని అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ
- ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



**రామన్నపేట,విశాలభారతి:** రామన్న పేట మండలంలోని సర్నేని గూడెం గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో సిరిపురం గ్రామంలో రూ.75 లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాన చేసిన నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడం జరిగింది అన్నారు.ముఖ్యమంత్రి కేసీఆర్ అందిస్తున్న ఆసరా సాయం.. అసహాయుల జీవితాల్లో ఉషోదయం అని అత్యధికంగా పెన్షన్ ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం అని కళ్యాణ లక్ష్మి ,షాది ముబారక్ పథకం దేశానికి ఆదర్శం నిలుస్తుంది అని పేదింటి ఆడపిల్లకు మేనమామ గా సీఎం కేసీఆర్ అని ఆయన అన్నారు. దేశానికే స్ఫూర్తి నిచ్చే విధంగా డా. బీ.ఆర్ అంబేద్కర్ ఆశయాల సాధనే లక్ష్యంగా "తెలంగాణ దళిత బంధు"తో దళిత సాధికారత కోసం నిర్విరామంగా కృషి చేస్తున్న సీఎం కేసీఆర్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోఎంపీపీ కన్నెబోయిన జ్యోతి బలరాం జడ్పిటిసి పున్న లక్ష్మీ జగన్మోహన్ సింగల్ విండో చైర్మన్ నంద్యాల బిక్షం రెడ్డి టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మందడి ఉదయ్ రెడ్డి కార్యదర్శి పోషబోయిన మల్లేశం స్థానిక సర్పంచులు దర్నే రాణి అప్పం లక్ష్మీనరసింహ గుత్తా నర్సిరెడ్డి ఎడ్ల మహేందర్ రెడ్డి రేఖ యాదయ్య ఉప్పు ప్రకాష్ మెట్టు మహేందర్ రెడ్డి బందెల యాదయ్య ఎంపీటీసీలు తిమ్మాపురం మహేందర్ రెడ్డి బడుగు రమేష్ వేమవరం సుధీర్ బాబు గోరిగే నరసింహ ఎండి అమీర్ నాయకులు నీల దయాకర్ బందెల రాములు అంతటి రమేష్ బత్తుల వెంకన్న పున్న వెంకటేశం నర్రా నరసింహ బండ శ్రీనివాస్ రెడ్డి పోతరాజు సాయి ఎండి ఇనాయత్ రామిని రమేష్ జాడ సంతోష్ కడమంచి స్వామి ఎడ్ల సురేందర్ రెడ్డి గర్దాస్ విక్రమ్ బాసాని రాజు పలు గ్రామాల వార్డు మెంబర్లు తదితరులు పాల్గొనడం జరిగింది.



## ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం

**వాజేడు,విశాలభారతి:** ములుగు జిల్లా వాజేడు మండలం వివిధ గ్రామాల్లో ఆదివాసి దినోత్సవాలు ఉత్సవంగా జరుపుకున్నారు వివిధ గ్రామాలలో ఆదివాసి జెండా ఎంగేసి మిఠాయిలు పంచుకునే సంబరాలు చేసుకున్నారు. వాజేడు మండల కేంద్రంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా ఆదివాసి నాయకులు వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు కొబ్బరికాయ కొట్టి జెండా ఎగరేసి ఆదివాసి ఐక్యత వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు ఎట్టి విద్యాసాగర్ పాయంజానకి రమణ వాజేడు సర్పంచ్ తల్లాడి ఆదినారాయణ గుమ్మడిదొడ్డి సర్పంచ్ జయలక్ష్మి వాజేడు ప్రభుత్వ వైద్యులు కొమరం మహేందర్ జూనియర్ పంచాయతీ కార్యదర్శుల మండల అధ్యక్షులు ఊయిక రమేష్ బాలాజీ సురేష్ రాంబాబు పాల్గొన్నారు



## కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

**ఐఎన్టీయూసీ కోదాడ ప్రాంతీయ కమిటీ అధ్యక్షులు పారా సీతయ్య**

**కోదాడ,విశాలభారతి:** కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితుల్లో ప్రధాని మోదీ పార్లమెంట్ లో కార్మిక వ్యతిరేక చట్టాలను ఆమోదింప చేయడాన్ని ఐ ఎన్ టి యు సి కోదాడ ప్రాంతీయ కమిటీ అధ్యక్షులు పారా సీతయ్య తీవ్రంగా ఖండించారు. బుధవారం కోదాడ పట్టణంలో కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకూ నిరసనగా అఖిలపక్ష నాయకులు, కార్మికులతో కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు తరలి వెళ్తున్న సందర్భంగా జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ గణనీయమైన లాభాలు సాధిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణతో 100% పెట్టుబడులు ఉపసంహరించుకోవడం అంటే కార్పోరేట్ శక్తులకు మద్దతు ఇవ్వడమే అన్నారు. కార్మికుల రక్త తర్పణతో, అనేక త్యాగాలు చేసి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేయడం కార్మికుల హక్కులను కాలరాయడమేనని అన్నారు. కార్మికులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పాలూరి సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ బాల్ రెడ్డి, ట్రేడ్ యూనియన్ నాయకులు యాకూబ్, నియోజవర్గ మహిళా అధ్యక్షురాలు బాలేబోయిన పుష్ప, ఐఎన్టీయూసీ నియోజవర్గ అధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్, కోదాడ పట్టణ అధ్యక్షులు భీమిశెట్టి వెంకటేశ్వర్లు, బెలిదే అశోక్, మధు, శ్రీను పాల్గొన్నారు.

## అర్అర్ ఫౌండేషన్ అధ్వర్యంలో అంకాపూర్ గ్రామంలో కంటి వైద్య శిబిరం

**ఆర్మూర్,విశాలభారతి:**ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో పైడి రాకేష్ రెడ్డి ఫౌండేషన్ అధ్వర్యంలో కంటి వైద్య శిబిరం ఏర్పటు చేశారు .ఈ కంటి వైద్య శిబిరంలో 220 మంది గ్రామస్తులు,మరియు 600మందివిద్యార్థులు కంటి పరీక్షలు చేయించుకోవడం జరిగింది ఈ సందర్భంగాఫౌండేషన్ డైరక్టర్ సుచరిత రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం కండ్ల కలక వ్యాధి ఒకరి నుండి ఒకరికి రావడం మరియు మొబైల్ ఫోన్స్ ఎక్కువ ఉపయోగించడం వల్ల కంటి చూపు పై త్రివ ప్రభావం ఉంటుంది కావున మానవ శరీరంలో అతి ముఖ్యమైనది సున్నితమైన అవయం కన్ను అని ఏ చిన్న ఇబ్బంది అయిన వెంటనే డాక్టర్లను సంప్రదించాలని కోరారు.నాటు వైద్యం చేయించుకోవడం వల్ల కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉంది కావున అందుకే మొదట తన స్వగ్రామంలో



ఏర్పాటు చేయడం జరిగింది అని అతి త్వరలో వివిధ దశలో అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేస్తాం అని ఫౌండేషన్ అధ్వర్యంలో ఉచితంగా పరీక్షించి ,అవసరం మేరకు మందులు,కంటి అద్దాలు కూడా ఇస్తున్నాం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ చైర్మన్ గోపి కృష్ణ,సురేష్ రెడ్డి,సంతోష్ రెడ్డి భూమేశ్ తదితరులు పాల్గొన్నారు.



## క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను ఓడించాలి

- టీపీసీసీ ఉపాధ్యక్షులు చామల కిరణ్ కుమార్ రెడ్డి
- యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి మమతా నాగిరెడ్డి

**శాలిగౌరరారం,విశాలభారతి:** శాలిగౌరారం మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు చామల కిరణ్ కుమార్ రెడ్డి యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి మమత నాగిరెడ్డి మాట్లాడుతూ క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో నాటి బ్రిటిష్ పాలకులను తరిమేసిన చరిత్ర ఉందని అదే తరహాలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను రానున్న రోజుల్లో తరిమికొట్టి కేంద్రంలోనూ రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారం లక్ష్యంగా ప్రతి ఒక్కరు పని చేయాలన్నారు. బంగారు తెలంగాణను అప్పుల తెలంగాణగా ముఖ్యమంత్రి కేసీఆర్ మార్చారని కెసిఆర్ కు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు .కేసీఆర్ యూత్ కాంగ్రెస్ లో పని చేశారని , రాజకీయ బిక్ష పెట్టిన కాంగ్రెస్ పార్టీకి కెసిఆర్ మోసం చేశారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకొచ్చేందుకు యూత్ కాంగ్రెస్ క్రియాశీలక పాత్ర పోషించాలని యూత్ కాంగ్రెస్ గొప్ప పోరాట చరిత్ర ఉందన్నారు. తెలంగాణను దోచుకు తింటున్న కేసీఆర్ కుటుంబ పాలనకు అంతం చెప్పేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు అన్నెబోయిన సుధాకర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కొమ్ము జోహార్, జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పరమేష్, యూత్ కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు పాకాల సతీష్, ఆకారం సర్పంచ్ కందాల సంబరం రెడ్డి ఎంపీటీసీలు నోముల జనార్దన్ నక్క శంకరమ్మ మల్లేష్ మాజీ వైస్ ఎంపీపీ భూపతి అంజయ్య మండల అధ్యక్షులు మహేష్ ,ఉపాధ్యక్షులు కట్లకుంట్ల రమేష్, నిమ్మల కృష్ణమూర్తి గైగుళ్ళ అవిలయ్య కదారి అంజయ్య బోడ దానయ్య గోని వెంకటయ్య శంకర్ వెంకట్ రెడ్డి కుర్ర లింగయ్య, నోముల రవి తదితరులు పాల్గొన్నారు.





## కాకతీయ నగర్ నూతన కమిటీ

**అధ్యక్షులుగా భాగ్యలక్ష్మి**

**మేడిపల్లి,విశాలభారతి:** పీర్జాదిగూడ కార్పొరేషన్ రెండో డివిజన్ పరిధిలోని కాకతీయ నగర్ కాలనీలో ఇటీవల ఏర్పాటు కాబడిన నూతన కమిటీని స్థానిక కార్పొరేటర్ సుభాష్ నాయక్ వారిని సన్మానించారు.కలిసి ఉంటే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసుకోవచ్చని రానున్న రోజుల్లో కాకతీయ కాలనీలో ఉన్నటువంటి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి,అసోసియేట్ అధ్యక్షులు తారాసింగ్,ప్రధాన కార్యదర్శి జహంగీర్,కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ కల్చరల్ చాడ సురేందర్ రెడ్డి వైస్ ప్రెసిడెంట్ వాసు,కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## చదువు మానేసిన వారు ఓపెన్ స్కూల్ ను సద్వినియోగం చేసుకోవాలి

**ఉమ్మడి నల్గొండ జిల్లా ఓపెన్ స్కూల్ కన్వీనర్ జగదీష్**

**కోదాడ,విశాలభారతి:** చదువు మధ్యలో మానేసిన వారికి ఓపెన్ స్కూల్ వరం లాంటిదని ఉమ్మడి నల్గొండ జిల్లా ఓపెన్ స్కూల్ కన్వీనర్ జగదీష్ అన్నారు. బుధవారం కోదాడ పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా గల బాయ్స్ హై స్కూల్ నందు ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ ను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువు మధ్యలో మానేసిన వారికి తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ ను పూర్తిచేసుకునేందుకు ఓపెన్ స్కూల్ ఒక వరం లాంటిది అన్నారు. ఇట్టి అవకాశాన్ని చదువు మానేసిన వారు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకొని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందాలన్నారు. విద్యను అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు ఓపెన్ స్కూల్లో ప్రవేశాల కొరకై విస్తృతంగా ప్రచారం నిర్వహించి ఎక్కువమంది చేరే విధంగా ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. అనంతరం తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, నరసింహారావు, రాజారావు, రామకృష్ణ,సరిత, పద్మావతి, పాండురంగ చారి, పూర్ణ చంద్రరావు, శ్రీనివాస్, బిక్షం, భవాని, తదితరు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

**ఆర్మూర్,విశాలభారతి:** మక్లూర్ మండలంలోని గుంజిలి గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధితులకు పంపిణీ చేశారు,చెక్కులను మంజూరు చేసిన ఆర్మూర్ ఎమ్మెల్యే పియూసి ఛైర్మెన్ బారస పార్టీ నిజామాబాద్ అధ్యక్షులు ఆశన్న గారి జీవన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు ఈకార్యక్రమంలో సీనియర్ నాయకులు జీవన్ అన్న యువసేన మండల అధ్యక్షులు గోపు రంజిత్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## గృహలక్ష్మి పథకం గడువు పొడిగించాలి

**ఎల్లంకి మహేష్ ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు**



**వలిగొండ,విశాలభారతి:**రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు తీరు పేద ప్రజల్ని ఊరిస్తూ, ఉరితీస్తున్నట్లు ఉన్నది గృహలక్ష్మి పథకానికి రెండు రోజుల గడువు ఇవ్వడం పేద ప్రజలకు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జత చేయాలని అనడంతో పేద ప్రజలు తీవ్రమైన ఇబ్బందులకు గురి అవుతున్నారు, మరోపక్క రేషన్ కార్డు ఫ్యామిలీలో ఉన్నప్పటికీ, అందులో మహిళలు పేరు లేకుండా పోయింది ఎన్నిసార్లు రేషన్ కార్డులో పేరు చేర్చుకొనుటకు దరఖాస్తు చేసుకున్న కూడా డీఎస్ఓ పెండింగ్ ఈ సైట్ ఓపెన్ కావటం లేదని అధికారులు ఈ విధంగ చెప్పి ఇప్పటివరకు వారి పేర్లు రేషన్ కార్డులో చేర్చకపోవడంతో అనేకమైన సమస్యలు ఉన్నాయని,ఇలాంటి సమస్యలు, ఉండడంతో దరఖాస్తుదారులకు ఈ గృహలక్ష్మి పథకానికి అనేకమైన ఆంక్షలు ఉండడంతో తీవ్రమైన ఆవేదన గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వం వైన్స్ షాపులకు 15 రోజులు గడువు ఇచ్చి పేదల దగ్గరికి వచ్చేసరికి రెండు రోజులు గడివి ఇవ్వడమేమిటని. అన్నారు ప్రభుత్వం రెండు రోజులు దరఖాస్తుల స్వీకరించడం ఏమిటని ప్రశ్నించారు.ఇప్పటికైనా ప్రభుత్వం ఈనెల చివర వరకు గడువు పొడిగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# తెలంగాణలో ఆలయాలకు మహర్దశ

- నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధి కోసం 11.50 కోట్లు మంజూరు
- షాద్ నగర్ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్



**షాద్ నగర్‌విశాలభారతి:** తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో ఆలయాలకు ఎంతో గుర్తింపువచ్చిందని షాద్ నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గంలోని 11 హిందూ దేవాలయాలకు 11.50 కోట్ల రూపాయలను మంజూరు చేస్తూ ఉత్తర్వులను జారీ చేసిందన్నారు. ఆలయాల్లో ధూప దీప నైవేద్యంతో పాటు,ఆలయ కార్యక్రమాలకు వినియోగించుకోవచ్చని, ఆయా ఆలయాల మరమ్మత్తులు తదితర నిర్మాణాలు ఇతర సౌకర్యాలు సమకూర్చుకోవచ్చని ఎమ్మెల్యే తెలిపారు. ఫరూక్ నగర్ మండలం శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయానికి 5 కోట్ల రూపాయలు, ఎలికట్ట భవాని మాత దేవాలయానికి 2 కోట్లు, మొగిలిగిద్ద రంగనాథ స్వామి దేవాలయానికి 50 లక్షలు, గిరాయి గుట్ట తండా శ్రీ లక్ష్మీ నరసింహ దేవాలయానికి 50 లక్షలు, నందిగామ మండలం మామిడిపల్లి గ్రామంలోని సీతారామ చంద్రస్వామి దేవాలయానికి 50 లక్షలు, దేవునిపల్లి వేణుగోపాలస్వామి దేవాలయానికి 50 లక్షలు, వెంకిర్యాల గ్రామంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయానికి 50 లక్షలు, కేశంపేట మండలంలోని బైర్ఖాన్ పల్లి గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి 50 లక్షలు, వేములనర్వ గ్రామంలోని వేణుగోపాలస్వామి దేవాలయానికి 50 లక్షలు, కొండారెడ్డిపల్లి గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి 50 లక్షలు, తొమ్మిదిరేకుల గ్రామంలోని శివాలయానికి 50 లక్షలు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్టు ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ తెలిపారు.

# ఉద్యమ కెరటం బోయిన్ పల్లి సత్యవతి కి ఓయూ డాక్టరేట్

- పిడిఎస్ యు సాధారణ కార్యకర్తగా ప్రస్థానం
- ఉద్యమ నిర్మాణంలో క్రియాశీలక పాత్ర
- నాడు ఉద్యమ రంగంలో నేడు రాజకీయ రంగంలో
- ఆంగ్ల సాహిత్యంలో డాక్టరేట్ ప్రకటించిన ఉస్మానియా యూనివర్సిటీ



**హైదరాబాద్,విశాలభారతి:** మలిదశ తెలంగాణ ఉద్యమ కారిణి, పీడీఎస్ యు విద్యార్థి సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు బోయిన్ పల్లి సత్యవతికి ఆంగ్ల సాహిత్యంలో ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ను ప్రకటించింది. రిప్రజెన్టేషన్ ఆఫ్ మల్టిపుల్ ఐడెంటిటీస్ ఇన్ ఇండియన్ రైటింగ్స్: ఎ స్టడీ ఆఫ్ సెలెక్టెడ్ వర్క్స్ ఆఫ్ మహాశ్వేతాదేవి అండ్ గీతా హరిహరణ్. మహాశ్వేతాదేవికి ఎంతో గుర్తింపు తెచ్చిన "అజారు చారు సీమ (1084's మదర్) అనే రచన మరియు ఫోర్ క్వార్టర్స్ గీతా హరిహరణ్ కామన్వెల్త్ ప్రైజ్ గెలిచినటువంటి ద థౌజండ్ ఫేసెస్ ఆఫ్ నైట్, వెన్ డ్రీమ్స్ ట్రావెల్స్ పై సత్యవతి పరిశోధన చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం కారుకొండ గ్రామంలో పుట్టిన సత్యవతి సుదీర్ఘ కాలం పాటు ప్రగతిశీల విద్యార్థి ఉద్యమ నిర్మాణంలో క్రియాశీలక పాత్ర పోషించారు. ఇంటర్మీడియట్ చదివే రోజుల్లోనే పిడిఎస్ యు సాధారణ కార్యకర్తగా ప్రస్థానం ప్రారంభించిన బోయిన్ పల్లి సత్యవతి, హైదరాబాద్ జిల్లా పీఎస్ యు అధ్యక్షురాలిగా, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గా పని చేశారు. సాంఘీక సంక్షేమ హాస్టల్స్ మొదలుకొని, విద్యారంగ సమస్య పరిష్కారం కోసం పోరాటం నిరంతరం పోరాటం చేశారు. కళాశాలల్లో, హాస్టల్స్ లో అమ్మాయిల పై జరిగే ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ నిషేధించాలని గళమెత్తి, విజయం సాధించారు. మహిళల పై జరిగిన ప్రేమోన్మాద దాడులకు వ్యతిరేకంగా విజయవాడ శ్రీలక్ష్మి ఘటన మొదలుకొని వరంగల్ స్వప్నిక, ప్రణీత లపై జరిగిన యాసిడ్ దాడిని మరియు నిన్నామొన్నటి నిర్భయ,అభయ, దిశ లపై జరిగిన అత్యాచారం, హత్యలపై బలమైన పోరాటాన్ని వేలమంది మహిళలను సమీకరించి ర్యాలీలు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు, ముఖ్యంగా అమ్మాయిలు ఎదురు కుంటున్న వసతి సమస్యల పై పోరాడి అధికారులతో వారికి భవన నిర్మాణం చేపట్టేలా చేసి విజయం సాధించారు. తెలంగాణ రాష్ట్రంలో వై ఎస్సార్, తెలంగాణ పార్టీ ఆవిర్భావం నుండి ఆ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిలతో క్రియాశీలంగా పని చేస్తూ, ప్రస్తుతం వైఎస్ ఆర్ టీపి రాష్ట్ర అధికార ప్రతినిధిగా, నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజక వర్గ ఇంఛార్జి గా పని చేస్తున్నారు. రాజకీయరంగంలో ఆమె చేస్తున్న సేవలను గుర్తించి మార్చ్ 8 2021. న ఆల్ ఎన్జీఓ ఆర్గనైజేషన్స్ మహిళా శిరోమణి జాతీయ అవార్డు అందించారు . అదేవిధంగా సావిత్రి బాయ్ పూలే ఫౌండేషన్ వారు ప్రజాస్వామ్య పరిరక్షణ అవార్డ్ 12వ తేదీన జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా అందించారు. తెలంగాణా ఉద్యమంలో అమరులైన విద్యార్థుల ఆకాంక్షలు నెరవేర్చలేని బిఆర్ ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటి చేశారు. నాడు విద్యార్థి ఉద్యమం, నేడు రాజకీయ రంగంలో దూసుకు పోవడంతో పాటు, అత్యున్నతమైన పీహెచ్ డి డిగ్రీ సాధించటం పట్ల ఉస్మానియా యూనివర్సిటీ ఆచార్యులు, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు, శ్రేయోభిలాషులు ఆమెకు అభినందనలు తెలియచేశారు.



# మైనార్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి

- ఈద్గా, కబ్రస్తాన్ల మరమ్మత్తులకి 70 లక్షలు మంజూరు
- మైనార్టీ నాయకులతో సమావేశమైన ఎమ్మెల్యే నోముల భగత్



**హాలియా,విశాలభారతి:** మైనార్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ అన్నారు. హాలియా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన మైనార్టీ నాయకులతో ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ సమావేశమయ్యారు. ఈద్గా, కబ్రస్తాన్ల మరమ్మత్తుల కొరకు రూ.70 లక్షల రూపాయల నిధులను మంజూరు చేయించిన విషయాన్ని నాయకులకు తెలిపారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో ముస్లింలకు పెద్ద పీఠ వేసిన ఘన కేసీఆర్ దే

అని పేద ముస్లిం సోదరీమణుల ఆడ పెండ్లిలకు మేన మామ రూపంలో షాది ముబారక్ పథకం ద్వారా 1 లక్ష 116 రూపాయలు అందజేస్తున్న నాయకుడు కెసిఆర్ గతంలో ఏ పార్టీ ఎన్నడూ చేయని విధంగా విధంగా రంజాన్ వేడుకకు బట్టలని ప్రభుత్వం పంపిణీ చేస్తుందని, మసీదులో మౌజన్, ఇమాములకు, గౌరవ వేతనాలు ఇచ్చి వారికి జీవన ఉపాధి కల్పిస్తున్నదన్నారు. నియోజకవర్గంలోని ఈద్గా, కబరస్థాన్ మరమ్మత్తులకు రూ.70 లక్షల నిధులు మంజూరు చేసిన కేసీఆర్ పేద ముస్లింల కొరకు మైనార్టీ బందు ప్రవేశపెట్టారని, హాలియాలో షాది ఖానా స్థలాన్ని మంజూరు చేసాం త్వరలో షాది ఖానా నిర్మించడానికి నిధులు కూడా మంజూరు చేస్తామన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీలకు ఓటు బ్యాంకుకు మాత్రమే వాడుకున్నారు తప్ప వారికి చేసింది ఏమీ లేదని తెలంగాణ సాధించుకున్న తర్వాత కేసీఆర్ పాలనలో పేద ముస్లింలకు అధిక ప్రాధాన్యత ఏర్పడిందని అన్నారు.ఈ కార్యక్రమం లో నియోజకవర్గం మైనార్టీ అధ్యక్షులు షేక్ అబ్బాస్, హాలియా మైనారిటీ పట్టణ అధ్యక్షులు మొమహ్మద్ బాబోద్దీన్, షేక్ బషీర్,కో ఆప్షన్ నెంబర్లు షేక్ మున్నా, షేక్ సలీం, షేక్ అన్వరోద్దీన్, నియోజకవర్గం మైనార్టీ ఉపాధ్యక్షులు అజ్గర్,మైనారిటీ నాయకులు హైమదలి, దస్తగిరి, ఖాసీం, హాజి,నయీమ్ పాషా, ఖాజా,జానీ మియా, నియోజక వర్గం లోని వివిధ గ్రామాల ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.




# వైన్ షాపులకు 15 రోజులు గృహలక్ష్మి పథకానికి మూడు రోజులా?

- ఎన్నికలు సమీపించడంతో రోజుకో కొత్త పథకం డ్రామా.
- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి, అందెబాబయ్య తదితరుల ఫైర్

**షాద్ నగర్,విశాలభారతి:** మద్యం షాపుల టెండర్ల కోసం దరఖాస్తు చేసుకోడానికి 15 రోజుల సమయం ఇచ్చిన ప్రభుత్వం గృహలక్ష్మి పథకం కింద ఇళ్లకు దరఖాస్తు చేసుకోడానికి కేవలం మూడు రోజుల సమయం ఇవ్వడం ఎంతవరకు సమంజసమని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, అందెబాబయ్య లు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారం షాద్నగర్ బిజెపి అసెంబ్లీ కార్యాలయంలో నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ టి.విజయ్ కుమార్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మూడు రోజుల్లో ఆదాయం, కుల, స్థల ధ్రువీకరణ పత్రాలను సమకూర్చుకోవడం సాధ్యమా అని వారు నిలదీశారు. ఈ నెలాఖరు వరకు గృహలక్ష్మి పథకం కింద పేదలు దరఖాస్తు చేసుకోవడానికి సమయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొంతమంది ఇండ్లు భర్త పేరు లేక ఇతరుల పేరు ఉంటాయని కనీసం గృహలక్ష్మి మహిళలకే ఇస్తున్నప్పుడు వారు పేరుపై బదిలీ చేసుకోవడానికి కూడా వీలు లేకుండా మూడు రోజులు పెట్టడం సిగ్గుచేటని అన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తున్నందున ముఖ్యమంత్రి కేసీఆర్ కొత్త డ్రామాలు మొదలుపెట్టాడని విమర్శించారు . దళిత బంధు నియోజకవర్గంలో ఎంతమందికి ఇచ్చారో ఎమ్మెల్యే చెప్పాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా దళిత గిరిజనులకు మూడు ఎకరాల భూమి నిరుద్యోగులకు ఉద్యోగం అలాగే బీసీ బందు ఎంతమందికి ఇచ్చారో ప్రజాముఖంగా వివరించాలని డిమాండ్ చేశారు. మాటికి ముందు కేటీఆర్ కేంద్రం అభివృద్ధి చేయలేదని చెబుతున్నారని, జిల్లాలో ఒక డబల్ బెడ్ రూమ్ అయినా ఇచ్చారా అని ప్రశ్నించారు. గజ్వేల్ సిద్దిపేట సిరిసిల్ల నియోజకవర్గాలు మాత్రమే ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని రంగారెడ్డి జిల్లాను ఎందుకు విస్మరించిందని ప్రశ్నించారు. లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ కెసిఆర్ ఆలోచన వల్ల పుట్టిందని గొప్పగా చెబుతున్న అధికార పార్టీ నాయకులు ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి ఉన్నప్పుడు 72 జీవో ప్రకారం ప్రాజెక్టు సర్వేకు జీవో ఇచ్చిన విషయం మర్చిపోకూడదని గుర్తు చేశారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి హరీశ్వర్ రావు పేదల ఇండ్ల కోసం ఐదు లక్షల రూపాయలు ఇస్తామని ప్రకటన గుప్పించి ఇప్పుడు గృహలక్ష్మి పేర కొత్త పథకం తెచ్చి మూడు లక్షలు ఇస్తామని చెప్పడం సిగ్గుచేటని అన్నారు.

పీఎం ఆవాస్ యోజన కింద ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం 3.5 కోట్ల ఇళ్లను పూర్తి చేసిందని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్లో 12 లక్షల ఇళ్లు ఇప్పటికే పంపిణీ చేశారని వివరించారు. తెలంగాణకు కూడా కేంద్ర ప్రభుత్వం 2.85 లక్షల ఇళ్లకు మంజూరు ఇస్తే రాష్ట్ర ప్రభుత్వం యుటిలైజేషన్ సర్టిఫికెట్ ఇవ్వకుండా అడ్డుకుందని ఆరోపించారు.ఈ సమావేశంలో రాష్ట్ర యువ నాయకుడు ఏపీ మిథున్ రెడ్డి, పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, కమ్మరి భూపాలాచారి, దేపల్లి అశోక్ గౌడ్, కక్కునూరు వెంకటేష్‌గుప్త, లక్ష్మీకాంత్ రెడ్డి, నరసింహ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# హౌన్నజీపేట్ గ్రామంలో గడప గడపకి కాంగ్రెస్

**విశాల భారతి, ధర్పల్లి:** ధర్పల్లి మండల కేంద్రంలోని హోన్నజీపేట, వాడి గ్రామలలో బుధవారం నాడు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గడపగడపకి కాంగ్రెస్ అనే కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అరికాల నర్సారెడ్డి మరియు టీపీసీసీ ఉపాధ్యక్షులు తహెర్ బిన్ హందన్ ప్రారంభించారు.అశేష జనసమూహంతో పూలదండలతో,శాలువాతో, పటాకుల సందడితో స్వాగతం పలికారు. సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి మాట్లాడుతూ.... గ్రామంలో విస్తృతంగా పర్యటిస్తూ కడప గడపకు తిరుగుతూ ఆడబిడ్డల యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు రాబోయే కాలం అధికారం కాంగ్రెస్ దేనని ప్రతి ఒక్కరి సమస్యలు తీరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పోలసాని శ్రీనివాస్ గారు ,డిసిసి అధికార ప్రతినిధి చెలిమెలనర్సయ్య , ధర్పల్లి మండల అధ్యక్షులు ఆర్మూర్ బాల్ రాజ్ , ఉపాధ్యక్షులు జానీ ,మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బాల నర్సయ్య,సిరికొండ మండలం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు భూషణ్ రెడ్డి,NSUI రాకేష్, మోతె నవీన్ రెడ్డి,గాదరి గంగారెడ్డి, డాక్టర్ రాజేందర్ ,సుభాష్, మంగిత్య , దత్తు, లింబ్యనయక్ ,బండారి నరేష్, , గంగారెడ్డి , గద్వాల్ గంగారెడ్డి, శ్రీధరగౌడ్,సంపత్,కిషన్ మరియు మైనార్టీ సెల్ అధ్యక్షులు ఉస్మాన్, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మొరం తరలిస్తున్న ట్రాక్టర్లను,జేసీబీని పట్టుకున్న గ్రామస్తులు



**బాల్కొండ,విశాలభారతి:** అక్రమంగా మొరం తరలిస్తున్న ట్రాక్టర్లను,జేసీబీని గ్రామస్తులు పట్టుకున్నారు.ఈ సంఘటన భీమ్‌గల్ మండలంలోని జాగిర్యాల్ గ్రామంలో చోటు చేసుకుంది.వివరాలు...

జాగిర్యాల్ అడ్డగుట్ట నుండి అనుమతి లేకుండా మొరం తీస్తున్నారని సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడికి చేరుకొని మొరం తవ్వకాలను అడ్డుకున్నారు. మొరం తీస్తున్న జేసీబీతో పాటు మొరం తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకుని గ్రామానికి తరలించి అధికారులకు సమాచారం ఇచ్చారు.ఈ విషయంపై రెవెన్యూ అధికారులను వివరణ కోరగా మొరం తవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని సమాధానం ఇచ్చారు.

# ప్రజల పథకాలా.. ఎన్నికల పథకాలా..?

**సాంస్కృతిక శాఖ జిల్లా కో కన్వీనర్ కర్రెడ్ల నరేందర్ రెడ్డి.**



**షాద్ నగర్,విశాలభారతి:** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయం సమీపిస్తుండటంతో కొత్త కొత్త పథకాలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తుందని,ఇవి ఎలక్షన్ల కోసం పెట్టిన పథకాలేనా లేదా ప్రజలకు లబ్ధి చేర్చడానికి పెట్టిన పథకాల అని ఆయన అన్నారు. వైన్స్ టెండర్లకు గడువు 15 రోజులు ఇచ్చిన ప్రభుత్వం,2018 నుంచి మాటలకే పరిమితం చేసినటువంటి గృహలక్ష్మి పథకానికి మూడు రోజుల గడువు ఇవ్వడం పట్ల ప్రజలు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారన్నారు.ఇంకా ఆరు నెలల గడువు ఉన్నటువంటి వైన్స్ టెండర్లకు ఎందుకు ప్రభుత్వానికి తొందర అని, మద్యం డబ్బులపై ఆధారపడి రాష్ట్రంలో పాలన సాగుతుందన్నారు. ప్రభుత్వ భూములను అమ్మి ఖజానా నింపుకుంటున్నారని, మళ్ళీ బిఆర్ఎస్ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్తులు మిగలవన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని వచ్చే ఎన్నికలలో బీజేపీ కి పట్టం కట్టడం కాయమన్నారు.

# ఘనంగా యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం



**బాల్కొండ,విశాలభారతి:** యువజన కాంగ్రెస్ 63వ ఆవిర్భావ దినోత్సవాన్ని భీమ్‌గల్ మండల కేంద్రంలో బాల్కొండ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నాగేంద్రబాబు ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేసి ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా నాగేంద్రబాబు మాట్లాడుతూ యువతకు ఎక్కువగా ప్రాధాన్యత ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదని అన్నారు.మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ యువతను రాజకీయాల్లోకి తీసుకురావాలనే ఉద్దేశంతో నాడు యువజన కాంగ్రెస్ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే ప్రజావ్యతిరేక విధానాలపై యూత్ కాంగ్రెస్ నిరంతరం పోరాడుతుందన్నారు.దేశంలో,రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుకు యూత్ కాంగ్రెస్ ప్రముఖ పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వాక మహేష్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం అవినాష్,నియోజకవర్గ ఉపాధ్యక్షుడు చరణ్,పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్,జాన్సన్, గోపి,నవీన్, రమేష్, కన్నా,రాజు, లింబాద్రి,సురేష్,నవిద్,గణేష్,అక్తర్ తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళు

**షాద్ నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్**

**షాద్ నగర్,విశాలభారతి:** అభివృద్ధి, సంక్షేమం సీఎం కేసీఆర్ కు రెండు కండ్లలాంటివని, అందుకు అనుగుణంగానే రాష్ట్రంలో పాలన కొనసాగుతుందని షాద్ నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. బుధవారం నందిగామ ఎంపీపీ ప్రియాంకశివశంకర్ ఆధ్వర్యంలో చర్ల అంతిరెడ్డి గూడ,వెంకమ్మ గూడా,చేగూర్, బండోని గూడా, బుగ్గొని గూడ, నర్సప్ప గూడ గ్రామాలలో పల్లెబాట కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్నివర్గాల అభివృద్ధి కోసం కృషి చేస్తుందన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణ కావాలని కోరుకుంది ఈ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం కోసమేనన్నారు. తెలంగాణ ఏర్పడ్డప్పుడు అనేక సవాళ్లను అధిగమించి నేడు దేశంలో అనేక రంగాల్లో మన రాష్ట్రం అగ్రగామిగా కొనసాగుతున్నదని తెలిపారు. అనేక సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలవుతున్నాయని,దేశంలోనే రాష్ట్రం అగ్రగామిగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, కొత్తూరు మాజీ ఎంపిపి శివ శంకర్ గౌడ్, చేగూర్ మాజీ సింగిల్ విండో చైర్మన్ విఠల్,ఆయా గ్రామాల సర్పంచ్ లు, ఎంపీటీసీ లు, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య



**బాల్కొండ,విశాలభారతి:** ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ తెలిపారు. నియోజకవర్గంలోని బాల్కొండ మండలంలోని చిట్టాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మిక సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం మౌలిక సదుపాయాలను కల్పించిందన్నారు.డిజిటల్ తరగతులను విద్యార్థిని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని అన్నారు.ఆ తర్వాత పాఠశాలలో విద్యార్థుల హాజరును పరిశీలించారు.అలాగే పదవ తరగతి బోధనపై విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి బట్టు రాజేశ్వర్,మండల నోడల్ అధికారి సుదర్శన చారి,ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు నర్సారెడ్డి, ప్రేమ్ నగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్ పాల్గొన్నారు.

# వెంటనే గొర్రెల పంపిణీ చేయాలి



**నూతనకల్, విశాలభారతి:** డీడీలు చెల్లించిన గొర్రెల కాపరులకు ప్రభుత్వం వెంటనే గొర్రెలు పంపిణీ చేయాలని బీసీ విద్యార్థి యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పసుల అశోక్ యాదవ్ డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ గొర్రెలు వస్తాయన్న ఆశతో యాదవులు అప్పుచేసి మరి డీడీలు తీశారు. డీడీలు తీసి నాలుగు నెలలు దాటిన నేటికి గొర్రెల పంపిణీ చేయకపోవడం దారుణం అని అన్నారు . డిడిల కోసం చేసిన అప్పు నెల నెల వడ్డీ పెరగడం తో ఏం చేయాలో తెలియక గొర్రెల కాపర్లు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని గొర్రెల కాపలదార్లను దృష్టిలో ఉంచుకొని గొర్రెల పంపిణీ పథకంలో నగదు బదిలీ అమలు చేస్తూ నేరుగా లబ్ధిదారుల ఖాతాలో డబ్బులు జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# అవినీతి బీఆర్ఎస్ సర్పంచులను సస్పెండ్ చేయాలి..

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్.
- గ్రూప్-2 పరీక్షను వాయిదా వేయాలి.
- గృహలక్ష్మీ దరఖాస్తు గడువును పొడగించాలి.



**కాగజ్ నగర్విశాల భారతి:** గ్రామపంచాయతీలో నిధుల దుర్వినియోగం చేసి,అవినీతికి పాల్పడిన బీఆర్ఎస్ సర్పంచులను తక్షణమే సస్పెండ్ చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం కాగజ్ నగర్ బీఎస్పీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపణలతో ఎలాంటి షోకాజ్ నోటీసులు ఇవ్వకుండా బెజ్జూర్ సర్పంచ్ అన్సర్ హుస్సేన్ ను సస్పెండ్ చేసిన జిల్లా కలెక్టర్ అవే ఆరోపణలు ఎదుర్కొంటున్న గుడ్లబోరి,భట్టుపల్లి,మొగుడ్ దగడ్ అధికార బీఆర్ఎస్ పార్టీ సర్పంచులను ఎందుకు సస్పెండ్ చేయలేదని ప్రశ్నించారు.బట్టుపల్లి సర్పంచ్ 1.20 కోట్లు నిధులు దుర్వినియోగం చేసినా కలెక్టర్ చర్యలు తీసుకోలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఒత్తిడితోనే ప్రతిపక్ష పార్టీల సర్పంచులను జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేస్తున్నారని ఆరోపించారు.ఎమ్మెల్యే ఒత్తిడితోనే బెజ్జర్ సర్పంచ్ కక్షపూరితంగా సస్పెండ్ చేశారన్నారు.బెజ్జర్ సర్పంచ్ ను తిరిగి కొనసాగించమని హైకోర్టు ఆదేశాలున్నా జిల్లా కలెక్టర్ అమలు చేయడం లేదన్నారు.ఎమ్మెల్యే కోనప్పకు మతిభ్రమించి,వచ్చే ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే ప్రతిపక్ష నాయకులపై ప్రతీకారం తీర్చుకుంటున్నారని తెలిపారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన అధికార పార్టీ సర్పంచులపై జిల్లా కలెక్టర్ తక్షణమే పూర్తిస్థాయి విచారణ చేసి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో బీఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు.

**రైల్వే ఓవర్ బ్రిడ్జి ఇంకెప్పుడు..?**

కాగజ్ నగర్ సిర్పూర్ మధ్య రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ప్రారంభమై ఎనిమిదేళ్లు గడిచిన పూర్తి కాలేదని విమర్శించారు.సిర్పూర్ వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైల్వే బ్రిడ్జి పూర్తి చేయుటకు స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వంపై ఎందుకు ఒత్తిడి చేయడం లేదని ప్రశ్నించారు. రైల్వే బ్రిడ్జి కాంటాక్ట్ ఎమ్మెల్యేకు దక్కలేదలేక కమిషన్లు రావడంలేదనా అని ప్రశ్నించారు. తెలంగాణకు వలస వచ్చి రెవిన్యూ,పోలీస్ యంత్రాంగాన్ని చెప్పు చేతుల్లో పెట్టుకొని నియోజకవర్గంలో దౌర్జన్యం చేస్తున్నారని మండిపడ్డారు. రాజ్ కుమార్ అనే పంచాయతీ రాజ్ ఇంజనీర్ 20 ఏళ్ల నుండి ఇక్కడే పని చేయడం ఏంటని ప్రశ్నించారు. వచ్చే వారం రోజుల్లో అవినీతికి పాల్పడిన బిఆర్ఎస్ సర్పంచులపై చర్యలు తీసుకోకపోతే కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు.

**గ్రూప్-2 పరీక్షను వాయిదా వేయాలి.**

రాష్ట్రంలో వరుసగా పోటీ పరీక్షల షెడ్యూలు విడుదల చేయడంతో లక్షలాది మంది గ్రూప్2 అభ్యర్థుల ఆందోళన చెందుతున్నారని అన్నారు. గ్రూప్2 అభ్యర్థుల విన్నపం మేరకు మరో మూడు నెలలు గ్రూప్2 పరీక్షను వాయిదా వేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి ఎంతో కష్టపడి ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు గురుకుల ఉద్యోగాలు, టీఎస్పీఎస్సీ పరీక్షల మధ్య కాలవ్యవది తక్కువ ఉండడంతో లక్షలాదిమంది అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్, టీఎస్పీఎస్సీ చైర్మన్ శాంతియూతంగా ఒత్తిడి లేకుండా గ్రూప్2 పరీక్షలు నిర్వహిస్తానని చెప్పిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా గుర్తు చేశారు.

**గృహలక్ష్మీ దరఖాస్తు గడువును పొడగించాలి.**

పేదల కోసం ప్రభుత్వం తలపెట్టిన గృహలక్ష్మీ దరఖాస్తు గడువును పొడగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 30 లక్షల మంది ఇండ్లు లేని నిరుపేదలకు ఇంత తక్కువ గడువు ఉంటే దరఖాస్తు ఎలా వీలవుతుందని ప్రశ్నించారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి మోసపూరిత వాగ్దానాలు, నమ్మి మోసపోవొద్దన్నారు.ముఖ్యమంత్రి ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నారని, అయిష్టంగానే ఈ పథకం తెచ్చినట్లు ఉందన్నారు.

# మణిపూర్ తగలబడుతుంటే మోదీ, షా ఓట్ల వేట..


- గిరిజనులు అంటే మోదీకి చులకన.
- విభజించు పాలించు అనే విధానాన్ని బీజేపీ అవలంభిస్తోంది.
- బీజేపీకి ఎన్నికలు, రాజకీయ ప్రయోజనాలే ముఖ్యం-
- లోక్ సభలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి.



**న్యూఢిల్లీవిశాల భారతి:** గడిచిన తొమ్మిదేళ్లుగా ఈ దేశంలో విభజించు పాలించు అనే విధానాన్ని బీజేపీ అవలంభిస్తోందని, మణిపూర్‌తో సహా దేశంలోని పలు చోట్ల జాతుల మధ్య వైరాన్ని పెంచిపోషిస్తూ బీజేపీ పార్టీ తన అధికారాన్ని పదిలం చేసుకోవాలని చూస్తోందని మల్కాజ్ గిరి ఎంపీ, టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం లోక్ సభలో ఇండియా కూటమి ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు.ప్రధానికి ఆదివాసీలు, గిరిజనుల పట్ల చులకనభావం ఉందని, ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రోజైనా పార్లమెంట్‌కు వచ్చి దేశంలో ఆదివాసీలు, గిరిజనులపై జరుగుతున్న దాడులపై స్పందిస్తారని అంతా భావించామని కానీ ఆయన రాలేదన్నారు. ఆదివాసీలు, గిరిజనులపై ప్రధానికి చులకనభావమన్నారు. మణిపూర్‌లో జరిగిన దాడులపై ప్రధాని జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో ఆడబిడ్డలు కాలిపోయి, అక్కడి ప్రజల తలలు తెగిపడుతుంటే బాధ్యత వహించాల్సిన ప్రధాని మోడీ, హోంశాఖ మంత్రి అమిత్ షాలు కర్నాటకలో ఓట్ల వేటలో ఉన్నారని ఆరోపించారు. మణిపూర్‌లో గిరిజనులపై జరుగుతున్న దాడులను దృష్టిలో పెట్టుకుని రాముడిని, భజరంగ్ దళ్‌ను రాజకీయాలకు వాడుకుందామని చేసిన ప్రయత్నాలను కర్నాటక ప్రజలు తిప్పికొట్టారన్నారు. బీజేపీకి ఎన్నికలు, రాజకీయ ప్రయోజనాలే ముఖ్యం అన్నారు. ఎన్డీయే అంటే నేషన్ డివైడ్ అలయెన్స్ అని ఎద్దేవా చేశారు. ప్రధాని సభకు వచ్చి మణిపూర్ ప్రజలకు విశ్వాసం, నమ్మకం కలిగించేలా ఆదేశించాలని 140 కోట్ల తరపున తాను స్పీకర్‌ను విజ్ఞప్తి చేస్తున్నాన్నారు రేవంత్ రెడ్డి. ప్రపంచంలోనే అత్యధిక అబద్దాలు ఉన్న పుస్తకాలు బీజేపీ మేనిఫెస్టోలు అని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. మోదీ నినాదం వన్ నేషన్ వన్ ఎలక్షన్, వన్ ట్యాక్స్ కాదు. ఆయన నినాదం వన్ నేషన్ వన్ పర్సన్..ఇది శోచనీయం.. దేశానికి అవమానం..అని బీజేపీ తీరును రేవంత్ దుయ్యబట్టారు. గత తొమ్మిదేళ్లుగా మోదీ నేతృత్వంలో ప్రజలకు ఇచ్చిన ఏ హామీని నెరవేర్చలేదు. ప్రతీ ఏటా 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోసం చేశారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న హామీ నెరవేరలేదు. నల్లధనం వెనక్కు తెచ్చి పేదవాడి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామన్న హామీ ఏమైందని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. అందుకే గొగోయ్ గారు ఇండియా కూటమి తరపున ఇచ్చిన అవిశ్వాసాన్ని సమర్థిస్తున్నా అన్నారు. తెలంగాణను భవిష్యత్‌ను నాశనం చేయడానికి లిక్కర్ పార్టీ, నిక్కర్ పార్టీ ఒక్కటయ్యాయి అని రేవంత్ రెడ్డి బీఆర్ఎస్, బీజేపీ పార్టీల తీరును ఎండగట్టారు.

# చంద్రబాబుపై అటెంప్ట్ టు మర్డర్ కేసు

- ఏ2గా దేవినేని ఉమ
- పలువురు టీడీపీ నేతల మీద కూడా..



**విశాలభారతి, ఏపీ:** పుంగనూరు, అంగళ్లు హింసాత్మక ఘటన కేసులు మరో మలుపు తిరగాయి. ఇందులో ఏ1 గా టీడీపీ అధినేత చంద్రబాబును చేరుస్తూ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆయనతోపాటు ఏ2గా దేవినేని ఉమామహేశ్వరరావు, ఏ3గా అమర్‌నాథ్ రెడ్డిని చేర్చారు. అన్నమయ్య జిల్లా ముదివీడు పీఎస్‌లో కేసు నమోదు చేశారు.చంద్రబాబుపై హత్యాయత్నం, నేరపూరిత కుట్ర కింద కేసు నమోదు చేశారు. ఈ నెల 4న చంద్రబాబు చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరి పర్యటన సందర్భంగా ఘర్షణ జరిగింది. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం అంగళ్లు వద్ద జరిగిన అల్లర్లు, చిత్తూరు జిల్లా పుంగనూరులో జరిగిన అల్లర్లపై పోలీసులుకు ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదులతో కేసులు నమోదు చేసిన పోలీసులు చంద్రబాబుతోపాటు టీడీపీ లీడర్లను నిందితుల జాబితాలో చేర్చారు. అన్నమయ్య జిల్లా ముదివేడులో ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేసిన పోలీసులు ఏ1గా చంద్రబాబు, ఏ2గా దేవినేని ఉమ, ఏ3గా అమరనాథ్ రెడ్డి, ఏ4గా చల్లా బాబుపై కేసు నమోదు చేశారు. అయితే ప్రాజెక్టుల సందర్శన పేరుతో టిడిపి కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా చంద్రబాబు ప్రసంగించారంటూ ఏఫ్ఐఆర్‌లో పోలీసులు నమోదు చేశారు. మంగళవారం రాత్రి ముదివేడు పోలీసుల స్టేషన్‌లో ఏ1గా చంద్రబాబు, ఏ2గా దేవినేని ఉమా, ఏ3గా అమర్‌నాథ్ రెడ్డి, పులివర్తి నానితో పాటుగా మరికొంత మంది టిడిపి నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో చంద్రబాబుపై హత్యాయత్నం, నేరపూరిత కుట్ర కింద కేసు నమోదు చేశారు. ఉమాపతిరెడ్డి అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు పోలీసులు. ఈనెల 4న మారణాయుధాలు, ఐరన్ రాడ్లు, ఇటుకలు, కర్రలు వంటి వాటితో ప్రయాణిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు ఉమాపతిరెడ్డి. ఈ మేరకు ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేసిన పోలీసులు 307 సెక్షన్ కింద హత్యాయత్నం, 120బీ సెక్షన్ కింద నేరపూరిత కుట్ర చేసినట్టు అందులో పేర్కొన్నారు.



# గద్దర్‌ను 3 గంటలు ఎండలో నిలబెట్టిన కేసీఆర్

- బతికి ఉన్నప్పుడు అవమానించారు.. చనిపోయాక ఇంటికెళ్లి ఓట్ల వేట.

**ట్విటర్‌లో ఆకునూరి మురళి విమర్శలు**

**హైదరాబాద్,విశాల భారతి:** ప్రజా యుద్ధనౌక గద్దర్ బతికి ఉన్నప్పుడు ఆయనను కలవడానికి కూడా సీఎం కేసీఆర్ ఇష్టపడకుండా అవమానించారని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి తెలిపారు. కానీ, చనిపోయాక ఆయన ఇంటికివెళ్లి ఓట్ల వేట మొదలుపెట్టారని ఆరోపించారు. ఈ మేరకు కేసీఆర్ తీరును తప్పుబడుతూ ట్వీట్ చేశారు. ''గద్దరన్న కేసీఆర్‌ను కలవడానికి రెండుసార్లు ప్రయత్నం చేసిండు. 2023 ఫిబ్రవరి 28న ప్రగతిభవన్ వద్దకు వెళ్లి కేసీఆర్‌ను కలవడానికి అనుమతి కోరిండు.మూడు గంటలపాటు గేటు దగ్గర ఎండలో కూర్చున్నడు. అయినా కేసీఆర్ కలవలేదు. బతికి ఉన్నప్పుడు కలవడానికి ఇష్టపడకుండా అవమానించిండు. చనిపోయాక అధికార లాంఛనాలు అని గద్దరన్న ఇంటికిపోయి.. ఓట్ల వేట మొదలుపెట్టిండు'' అని ట్విటర్‌లో మురళి విమర్శించారు.



# కుట్టుమిషి శిక్షణ శిబిరాన్ని సందర్శించిన మంత్రి

**తొర్రూర్విశాల భారతి:** మహబూబాబాద్ జిల్లా, పాలకుర్తి నియోజకవర్గం, తొర్రూరు మండలం, అమ్మాపురం గ్రామంలో కుట్టు మిషన్ శిక్షణ శిబిరాన్ని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆకస్మికంగా తనిఖీ చేసి శిక్షణ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కుట్టు శిక్షణకు హాజరవుతున్న మహిళలు, వారి హాజరు పట్టిక పరిశీలించారు. శిక్షణ జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. శిక్షణలో వారు నేర్చుకుంటున్న అంశాలపై ఆరా తీశారు. తప్పనిసరిగా అందరూ హాజరై కుట్టు శిక్షణ తీసుకొని, శిక్షణలో రాటుదేలి, మంచి ప్రయోజనకరమైన విధంగా బతికే ఏర్పాట్లు చేస్తున్నామని వాటన్నిటిని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కుట్టు శిక్షణార్థులకు వివరించారు. మంత్రి వెంట స్థానిక ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులు ఉన్నారు.

# అంబటి డాన్స్ వేసింది నిజమేగా

- వైసీపీ నేతలపై టీడీపీ జాతీయ కార్యాదర్శి లోకేష్ ఫైర్
- చిత్ర పరిశ్రమపై కక్ష కట్టవద్దని చిరంజీవి అనడం తప్పా
- చిరంజీవి వ్యాఖ్యల్లో తప్పేముందంటూ ప్రశ్న
- నారా లోకేష్ ను కలిసిన పులిచింతల ముంపు గ్రామాల ప్రజలు
- సత్తెనపల్లి నియోజకవర్గంలో పూర్తయిన నారా లోకేష్ యువగళం పాదయాత్ర
- నారా లోకేష్ కి వీడ్కోలు పలికిన కన్నా లక్ష్మీనారాయణ, టిడిపి ముఖ్యనేతలు, కార్యకర్తలు
- పెదకూరపాడు నియోజకవర్గంలోకి ప్రవేశించిన నారా లోకేష్ యువగళం పాదయాత్ర
- లోకేష్ కి ఘన స్వాగతం పలికిన టిడిపి ఇంఛార్జ్ కొమ్మాలపాటి శ్రీధర్, టిడిపి ముఖ్య నేతలు, కార్యకర్తలు



**విశాలభారతి, ఏపీ బ్యూరో:** యువగళం పాదయాత్రలో భాగంగా సత్తెనపల్లి సభలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మాట్లాడుతూ వైసీపీ నేతలు, మంత్రి అంబటి రాంబాబుపై విమర్శలు గుప్పించారు. "అంబటి రాంబాబు డాన్స్ వేసింది నిజమేగా. సంజన సుకన్యాతో అంబటి మాట్లాడింది నిజం కాదా?. లోకేష్, చంద్రబాబు, పవన్‌పై సెటైర్లు వేస్తూ సినిమాలు తీసినప్పుడు ఈ వైసీపీ కుక్కలు ఏమైపోయాయి. నాలుగు సంవత్సరాల నుంచి పోలవరంలో అభివృద్ధి లేదు. పోలవరం ప్రాజెక్టు చూడటానికి వెళితే మనపై కేసులు పెడుతున్నారు. చిత్ర పరిశ్రమపై కక్ష కట్టవద్దని చిరంజీవి అనడం తప్పా. చిరంజీవిపై ఈ వైసీపీ కుక్కలు మొరుగుతున్నాయి. ప్రత్యేక హోదా, ప్రజల సమస్యలపై దృష్టి పెట్టండి చిత్ర పరిశ్రమపై వద్దు అన్నారు చిరంజీవి. చిరంజీవి అన్నదానిలో తప్పేముందో ఈ వైసీపీ కుక్కలు చెప్పాలని లోకేష్ డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గంలోకి యవగళం పాదయాత్ర ప్రవేశించింది. బెల్లంకొండ అడ్డరోడ్డు వద్ద లోకేష్‌కు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ ఘన స్వాగతం పలికారు.

నారా లోకేష్ ను కలిసిన పులిచింతల ముంపు గ్రామాల ప్రజలు : పెదకూరపాడు నియోజకవర్గం పులిచింతల ముంపు గ్రామాలైన ఆర్ అండ్ ఆర్ సెంటర్, న్యూ చిట్యాల గ్రామస్తులు యువనేత లోకేష్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. మా గ్రామాల్లో పులిచింతల ప్రాజెక్టు ముంపునకు గురైన 700 కుటుంబాలు ఉన్నాయి. మేము మా తాతల తరం నుండి కేతవరం నరసింహస్వామి భూములకు శిస్తు కట్టుకుంటూ 7,500 ఎకరాలు సాగుచేసుకుంటున్నాం. మా పొలాలు మొత్తం పులిచించిల ప్రాజెక్టు కింద ప్రభుత్వం తీసుకుంది. 2009లో అప్పటి ప్రభుత్వం ఎకరాకు 1.5లక్షలు ఇస్తామని చెప్పి ఖాళీ చెక్కులు ఇచ్చారు. ఆ డబ్బులు ఇప్పటికీ అందలేదు. ఆ భూమి దేవస్థానానికి అని, పరిహారం ఇవ్వమని అధికారులు చెబుతున్నారు. జీవనాధారం కోల్పోయిన ఒక్కో కుటుంబనికి రూ.10 లక్షల చొప్పున నష్టపరిహారం ఇప్పించాలి. జీవనోపాధి కోల్పోయి పక్క గ్రామాల్లో కూలీ పనులకు వెళ్తున్నాం. మీ ప్రభుత్వం వచ్చాక మా బతుకుదెరువు కోసం గేదెలు, గొర్రెలు ఇప్పించాలి. ప్రాజెక్టు కట్టేటప్పుడు మా కుటుంబంలోని పిల్లలు చదువుకున్న పిల్లలకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పారు..కానీ ఇప్పటికీ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదు. కేతవరం వజ్ర లక్ష్మీ నరసింహస్వామి స్వయంభుగా వెలిసిన స్వామి విగ్రహం ముంపు గ్రామమైన కొండమీద పెట్టారు. ఆ గుడి దగ్గరకు వెళ్లాలంటే రోడ్డు లేదు, కరెంట్ లేదు. న్యూ చిట్యాల ఏర్పడి 15 ఏళ్లు అవుతున్నా ఇంత వరకూ స్మశానం లేదు. స్మశానం ఏర్పాటు చేయాలని కోరారు. నారా లోకేష్ మాట్లాడుతూ ప్రాజెక్టుల నిర్మాణ సమయంలో ముంపు బాధితులకు పరిహారం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. దీర్ఘకాలంగా పులిచింతల ముంపు గ్రామాల ప్రజలకు పరిహారం అందకపోవడం దురదృష్టకరం. అధికారంలోకి వచ్చాక సాంకేతిక, న్యాయపరమైన చిక్కులను తొలగించి పులించిల ముంపు గ్రామాల ప్రజలకు న్యాయం చేస్తాం. కేతవరం లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి రహదారి, విద్యుత్ ఏర్పాటుచేస్తాం. ముంపు గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, శ్మశానం ఇతర మౌలిక సదుపాయాలన్నీ కల్పిస్తాం.స్థానికంగా ఉన్న వనరులను వినియోగించి ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తామన్నారు









# గిరిజనుల ఆరాధ్య దైవం కేసీఆర్..

**-గిరిజన స్త్రీ - శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్..**



హైదరాబాద్'విశాల భారతి : ప్రపంచ ఆదివాసి దినోత్సవం పురస్కరించుకొని బంజారాహిల్స్ ఆదివాసీకొమురం భీమ్ భవన్ లో జరిగే ఆదివాసుల ఉత్సవాలకు ముఖ్య అతిధి గా హాజరైన మంత్రి. మంత్రికి ఘన స్వాగతం పలికిన ఆదివాసులు. అనంతరం కొమురం భీమ్ విగ్రహానికి మంత్రి సత్యవతి రాథోడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. సభా వేదిక పై పద్మశ్రీ కనకరాజు, శ్రీరామ చంద్రయ్యలను, మంత్రి సత్కరించారు. అనంతరం మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ...ప్రపంచ ఆదివాసీ దినోత్సవం వేడుకలు సీఎం కేసీఆర ్బంజారాహిల్స్ లో నిర్మించిన ఆదివాసీ భవన్ లో జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు..







సూపర్ స్టార్ మహేష్ బాబు, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ సూపర్ మాస్ ఎంటర్ టైనర్ 'గుంటూరు కారం' కోసం ముచ్చటగా మూడోసారి చేతులు కలిపారు. హారిక & హాసిని క్రియేషన్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ఈ సూపర్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఆగష్టు 9న సూపర్ స్టార్ మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా, స్టైలిష్ మాస్ అవతార్‌లో కనిపిస్తున్న మహేష్ బాబు సూపర్ మాస్ పోస్టర్ లను చిత్ర బృందం విడుదల చేసింది. పోస్టర్ లో లుంగీ కట్టుకొని, కళ్లద్దాలు పెట్టుకొని, బీడీ కాలుస్తున్న మహేష్ బాబు లుక్, అలాగే మరో చిత్రం లో జీన్స్, బ్లాక్ టీ షర్ట్ పై రెడ్ కలర్ షర్ట్, ఎర్రని తలపాగా తో ప్రత్యర్థుల తో తలపడుతున్నట్లుగా మహేష్ కనిపిస్తున్న వైనం కట్టిపడేస్తోంది. ఇప్పటికే సూపర్ స్టార్ కృష్ణ గారి జయంతి సందర్భంగా మాస్ స్ట్రైక్ పేరుతో విడుదల చేసిన గ్లింప్స్ అద్భుతమైన స్పందనతో వైరల్ గా మారిన విషయం తెలిసిందే. గ్లింప్స్ కి ఎస్. థమన్ అందించిన నేపథ్య సంగీతం విశేషంగా ఆకట్టుకొని సినిమాపై అంచనాలను మరింత పెంచింది. అత్యంత విజయవంతమైన కలయికగా పేరు తెచ్చుకున్న త్రివిక్రమ్‌థమన్ కాంబినేషన్ పై ఉన్న అంచనాలను దృష్టిలో పెట్టుకొని.. థమన్ అద్భుతమైన సంగీతాన్ని అందించడానికి కృషి చేస్తున్నారు. గుంటూరు కారం షూటింగ్‌ను ఆగస్టు ద్వితీయార్థంలో పునఃప్రారంభించనున్నారు. ఈ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా 2024, జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

# చీరకట్టులో మెరుస్తున్న మిల్కీ బ్యూటీ

శ్రీ అనే చిన్న సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన తమన్నా హ్యాపీ డేస్ సినిమాతో గుర్తింపు తెచ్చుకుంది. అక్కడి నుంచి వెనుదిరిగి చూసింది లేదు. టాలీవుడ్‌లో దాదాపు అందరు స్టార్ హీరోలతో పని చేసిన ఆమె బాలీవుడ్‌లోనూ తన మార్కు చూపెడుతోంది. సినిమాలు, వెబ్ సిరీస్‌లతో బిజీగా ఉంది. ప్రస్తుతం టాలీవుడ్‌లో సౌత్ సూపర్ స్టార్ రజనీకాంత్ సరసన నటించిన జైలర్, మెగా స్టార్ చిరంజీవి సరసన హీరోయిన్‌గా నటించిన భోళాశంకర్ ఈనెల 10, 11వ తేదీల్లో విడుదల కానుంది. ఈ సినిమాల ప్రమోషన్స్‌లో తమన్నా బిజీగా ఉంది. మరోవైపు సోషల్ మీడియాలో కూడా తమన్నా యాక్టివ్‌గా ఉంటోంది. ఎప్పటికప్పుడు తన అప్డేట్స్, లేటెస్ట్ ఫొటోలను అభిమానులతో పంచుకుంటోంది. తాజాగా చీర, నగలు ధరించి దిగిన ఫొటోలను షేర్ చేసింది. ఎంతో అందంగా కనిపిస్తున్న తమన్నా ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



# 'సోల్ ఆఫ్ సత్య' టీజర్ రిలీజ్



సుప్రీమ్ హీరో సాయి ధరమ్ తేజ్ తన స్నేహితులతో కలిసి ఓ స్పెషల్ వీడియోను రూపొందించారు. దేశం కోసం పోరాటం చేసే అజ్ఞాత యోధులకు సంబంధించిన వీడియో అది. మంగళవారం ఈ స్పెషల్ వీడియో నుంచి 'సత్య' అనే పేరుతో ఓ టీజర్‌ను విడుదల చేశారు. ఈ స్పెషల్ వీడియోలో సాయిధరమ్ తేజ్‌తో కలిసి స్వాతి నటించింది. ఈ గ్లింప్స్‌ను మేకర్స్ 'సోల్ ఆఫ్ సత్య' అని పేర్కొన్నారు. వీడియో కూడా టైటిల్‌కు తగ్గట్టే ఉంది. గ్లింప్స్‌ను గమనిస్తే సాయిధరమ్ తేజ్, కలర్స్ స్వాతి పెళ్లి చేసుకోవటం ప్రేమతో కౌగిలించుకునే సన్నివేశాలను చూడొచ్చు. ఈ మ్యూజికల్ షార్ట్‌లోని పాటను టాలెంటెడ్ సింగర్ శృతి రంజని కంపోజ్ చేసింది. సత్య అనే స్పెషల్ వీడియోతో ఆమె మ్యూజిక్ డైరెక్టర్‌గా తన ప్రయాణాన్ని ప్రారంభిస్తుంది. ఇందులో సాయిధరమ్ తేజ్ సైనికుడిగా కనిపిస్తారు. ఓ సైనికుడు భార్య దేశం కోసం చేసే త్యాగాలను చూపిస్తున్నారు. ఇదే 'సత్య'లోని ప్రధానమైన ఎమోషన్. అది చూసినప్పుడు భావోద్వేగంతో మన ఛాతి ఉప్పొంగుతుంది. సాయిధరమ్ తేజ్, కలర్స్ స్వాతి వంటి తమదైన అద్భుతమైన నటనతో మ్యూజికల్ షార్ట్‌లో భావోద్వేగాలను పలికించారు. మరోసారి వారెంతో మంచి నటీనటులో ఈ పాటతో రుజువైందనే చెప్పాలి. దేశం కోసం పోరాటం చేసే ఎందరో యోధులకు సంబంధించిన సందేశాన్ని తెలియజేయటానికి మేకర్స్ చేసిన ప్రయత్నం ఆకట్టుకుంటోంది.

# ఖుషి అమేజింగ్ లవ్ స్టోరి, ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది

**: హీరో విజయ్ దేవరకొండ**



విజయ్ దేవరకొండ, సమంత హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఖుషి సినిమా ట్రైలర్ విడుదల కార్యక్రమం ఇవాళ హైదరాబాద్ లో ఘనంగా జరిగింది. ఈ మూవీని దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కించారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో సెప్టెంబర్ 1న 'ఖుషి' రిలీజ్ కు రెడీ అవుతోంది. ట్రైలర్ విడుదల కార్యక్రమంలో మైత్రీ సీఈవో చెర్రీ మాట్లాడుతూ 'ఖుషి' ట్రైలర్ రిలీజ్ వేడుకలో పాల్గొనేందుకు ఇక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరికీ థాంక్స్. దర్శకుడు శివ నిర్వాణ హార్ట్ అండ్ సోల్ తో ఈ సినిమాను రూపొందించారు. ఆయన కథ చెప్పినప్పుడే చాలా కొత్తగా, ఇంట్రెస్టింగ్ గా అనిపించింది. వెంటనే మేము మూవీని స్టార్ట్ చేశాం. డియర్ కామ్రేడ్ తర్వాత విజయ్ మా సంస్థలో చేస్తున్న రెండో చిత్రమిది. హేషమ్ అబ్దుల్ వాహబ్ సూపర్బ్ మ్యూజిక్ ఇచ్చారు. సెప్టెంబర్ 1న ఒక మంచి లవ్ స్టోరిని మీ ముందుకు తీసుకొస్తున్నాం. అన్నారు. నిర్మాత నవీన్ యెర్నేని మాట్లాడుతూ 'ఖుషి' సినిమాకు సపోర్ట్ చేస్తున్న మీ అందరికీ థాంక్స్. దర్శకుడు శివ, హీరో విజయ్ మా సంస్థలో ఈ సినిమా చేసే అవకాశం కల్పించారు. . సెప్టెంబర్ 1న 'ఖుషి' సినిమాను రిలీజ్ చేయబోతున్నాం. ఆగస్టు 15న గ్రాండ్ గా ప్రీ రిలీజ్ ఫంక్షన్ చేస్తాం. 'ఖుషి'ని ఇంత అందంగా తీర్చిదిద్దిన మా టీమ్ అందరికీ థాంక్స్. అన్నారు. హీరో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ 'ఖుషి' సినిమా ట్రైలర్ లాంచ్ లో పాల్గొనేందుకు వచ్చిన వివిధ రాష్ట్రాల మీడియా మిత్రులకు, అభిమానులకు థాంక్స్. ఇదొక అమేజింగ్ ఫిల్మ్. క్యూట్ లవ్ ఫిల్మ్. దేశ వ్యాప్తంగా ప్రేక్షకులు మా కథకు కనెక్ట్ అవుతారు. మన సంప్రదాయాలు, కుటుంబ బంధాలు, వివాహ వ్యవస్థ వంటి అంశాలతో ముడిపడిన సినిమా ఇది. ఇలాంటి చిత్రంలో భాగమవడం సంతోషంగా ఉంది. ఇప్పుడు దేశవ్యాప్తంగా మన కథలను చూపించే అవకాశం దక్కుతోంది. ఇలాంటి టైమ్ లో నేను హీరోగా ఉండటం అదృష్టంగా, గౌరవంగా భావిస్తున్నాను. 'ఖుషి' హాఫ్ పార్ట్ షూట్ చేసే టైమ్ కు సమంతకు హెల్త్ బాగాలేదు. ఆమె కోసం ఆరు నెలలు కాదు సంవత్సరం అయినా వెయిట్ చేద్దామని అనుకున్నాం. సమంత కోలుకుంటే చాలనుకున్నాం. ఈ సినిమాకు సమంత చేసిన కాంట్రిబ్యూషన్ మాకు తెలుసు. కానీ ఎన్ని ఇబ్బందులు ఉన్నా..ఆమె వచ్చి సినిమా పూర్తి చేసింది. లవ్ అనేది అందరి లైఫ్ లో ఒకటే. ఆ రూటెడ్ లవ్ స్టోరిని పాన్ ఇండియా వైజ్ చూపించాలని అనుకున్నాం. నాకు వెబ్ సిరీస్ లు చేసే ఉద్దేశం లేదు. నాకు పేరు ముందు బిరుదులు పెట్టుకోవడం ఇష్టం లేదు. అందుకే ఈ సినిమాలో ద విజయ్ దేవరకొండ అని టైటిల్స్ లో పెట్టాం. అని చెప్పారు.

# స్కంద షూటింగ్ పూర్తి



మాస్ మేకర్ బోయపాటి శ్రీను 'అఖండ' బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత ఉస్తాద్ రామ్ పోతినేనితో మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'స్కంద' కోసం చేతులు కలిపారు. తన హీరోలను మునుపెన్నడూ చూడని మాస్ గెటప్‌లలో చూపించడంలో పేరున్న బోయపాటి, రామ్‌ని పూర్తిగా డిఫరెంట్ లుక్ లో చూపిస్తున్నారు. పోస్టర్లు, ఇతర ప్రమోషనల్ మెటీరియల్ లో రామ్ మాస్ అవతార్ లో కనిపించారు. ఇదిలావుండగా, మాసీవ్ సెట్‌లో లీడ్ పెయిర్, డ్యాన్సర్‌లపై చివరి పాటను చిత్రీకరించారు. దీంతో స్కంద షూటింగ్ పార్ట్ మొత్తం పూర్తయింది. ఫోటోలో రామ్, శ్రీలీల.. దర్శకుడు బోయపాటి శ్రీను, నిర్మాత శ్రీనివాస చిట్టూరితో కలిసి ఫ్యాన్సీ దుస్తులలో కనిపించారు. మేకర్స్‌కి ఇప్పుడు సినిమా ప్రమోషన్ కు తగిన సమయం దొరికింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. ఇది పాన్ ఇండియా ప్రాజెక్ట్ కాబట్టి దేశవ్యాప్తంగా ఇతర భాషల్లో కూడా దీన్ని జోరుగా ప్రచారం చేయాలనుకుంటున్నారు. టీజర్, టైటిల్ గ్లింప్స్ కు ట్రెమండస్ రెస్పాన్స్ లభించగా, ఫస్ట్ సింగిల్ నీ చుట్టు చుట్టు చార్ట్‌బస్టర్ గా నిలిచింది. ఎస్ థమన్ స్వరపరిచిన ఈ పాట అన్ని మ్యూజిక్ చార్ట్‌లలో అగ్రస్థానంలో ఉంది. ఈ పాటలో రామ్, శ్రీలీల ఎనర్జిటిక్ ఎలిగెంట్ డ్యాన్స్ మూమెంట్స్ తో అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి, సినిమా చూడాలనే క్యూరియాసిటీని మరింత పెంచడానికి రెగ్యులర్ అప్‌డేట్ లతో ముందుకు రావాలని ప్లాన్ చేస్తున్నారు మేకర్స్.

# శ్రీమతి అక్కినేని అమలవిడుదల చేసిన తోడై నువ్వుండక పాట



ఏనుగంటి ఫిల్మ్ జోన్ పతాకం పై లక్ష్మణ్ చిన్నా ప్రధాన పాత్ర పోషిస్తూ స్వీయ దర్శకత్వం వహించిన చిత్రం "నచ్చినవాడు". ఇటీవలే విడుదల అయిన థియేట్రికల్ ట్రైలర్ కు మంచి స్పందన లభించింది. యూట్యూబ్ లో 20 లక్షల మంది ఈ ట్రైలర్ ను వీక్షించారు. అలాగే 'నా మనసు నిన్ను చేర' పాటను ఆదిత్య మ్యూజిక్ ద్వారా విని పాటలు చాలా బాగున్నాయి అని కామెంట్ చేశారు. ఏప్రియల్ నెలలో విడుదలయిన "ఎదపొంగెనా ఏమో " పాట టాప్ ఇండియన్ సాంగ్ ఆఫ్ ది వీక్ గా ఎంపిక అయ్యింది. ఇప్పుడు సంగీత దర్శకుడు మిజో జోసెఫ్ స్వరపరిచిన 'తోడై నువ్వుండక' అనే మెలోడీ పాటను శ్రీమతి అక్కినేని అమల గారు విడుదల చేశారు. ప్రముఖ గాయకురాలు సయొనోరా ఫిలిప్స్ పాడగా, యువ పాటల రచయిత హర్షవర్ధన్ రెడ్డి రచించగా, ఆదిత్య మ్యూజిక్ ద్వారా యూట్యూబ్ లో మంగళవారం విడుదలయింది. శ్రీమతి అక్కినేని అమల గారు 'తోడై నువ్వుండక' పాటను వీక్షించి తన సంతోషాన్ని వ్యక్తపరిచారు. మంచి మెలోడీ పాటను అందించిన సంగీత దర్శకుడు మిజో జోసెఫ్ తన శుభాకాంక్షలు తెలుపుతూ, సినిమా మంచి విజయం సాధించాలి అని తమ అభినందనలు తెలియజేశారు.



# గ్లామరస్ పిక్స్ తో అదితి

ఇటీవల బాలీవుడ్ లో ఢిల్లీ 6 అనే సినిమాలో నటించింది. ఈ సినిమా కూడా బాగానే క్లిక్ అయ్యింది. దీంతో, ఆమెకు వరసగా బాలీవుడ్ లో ఆఫర్లు క్యూ కడుతున్నాయి. తన కెరీర్ ని మాత్రం మళయాళంలో మొదలుపెట్టింది. ఆ తర్వాత అక్కడి నుంచి తమిళంలోకి, ఆ తర్వాత తెలుగులోకి అడుగుపెట్టి, అదరగొట్టింది. అదితి సోషల్ మీడియాలోనూ చాలా చురుకుగా ఉంటుంది. ఎప్పటికప్పుడు తన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. తాజాగా కూడా కొన్ని ఫోటోలు షేర్ చేసింది. ఆ ఫోటోల్లో అదితి చాలా అందంగా కనపడుతోంది. ఫ్లోరల్ గౌను ధరించింది. అయితే, అందులో ఆ గౌను స్లీవ్ లెస్ కావడంతో ఆమెఎద అందాలు స్పష్టంగా కనపడుతున్నాయి. ఎవరి గురించి తీక్షణంగా ఎదురు చూస్తున్నట్లుగా ఆ ఫోటోకి ఆమె ఫోజు ఇవ్వడం విశేషం. ఈ ఫోటోలు ప్రస్తుతం వైరల్ గా మారాయి. నెటిజన్లు లైకుల వర్షం కురిపిస్తున్నారు. ఇదిలా ఉండగా, అదితి గత కొంత కాలంగా హీరో సిద్ధార్థ్ తో ప్రేమలో పడింది అంటూ వార్తలు వస్తున్నాయి. వీరిద్దరూ కలిసి షికార్లు చేస్తూ, ట్రిప్ లకు వెళ్తున్న ఫోటోలు వైరల్ అవ్వడంతో,వీరు ప్రేమలో ఉన్నారని అర్థమైంది. అయితే, ఇప్పటి వరకు వీరిద్దరూ అయితే, దీనిపై క్లారిటీ ఇవ్వలేదు. ప్రస్తుతానికి అయితే, వీరు లివ్ ఇన్ రిలేషన్ లో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇక, సిద్ధార్థ్, అదితి లు మహాసముద్రం సినిమాలో కలిసి నటించారు. అప్పుడు ఏర్పడిన పరిచయమే ప్రేమగా మారినట్లు సమాచారం. ఆ మూవీలో సిద్ధార్థ తో పాటు, శర్వానంద్ కూడా నటించారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.